BALA CHELIMI

BALA




FEB 2026

FEB

₹40

ఫిబ్రవరి - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 5

FEBRUARY - 2026



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA




## FEBRUARY 2026

The tribal dance performance by our students celebrated Telangana's rich culture through striking attire, elaborate headgear, and rhythmic movements that brought the forest spirit alive on stage.

Oxford
Grammar High School
#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| | | | | | | |
| | | | | | | |

**Important Dates**

15 Feb - Maha Shivaratri

NOTES :


**Tradition is not to preserve the ashes, but to pass on the fire.**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక



| సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 5 | హైదరాబాద్ Hyderabad | ఫిబ్రవరి February | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|





లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| చదువు అన్ని భయాలనూ తొలగిస్తుంది | మణికొండ వేదకుమార్ | 5 |
| CSIR స్థాపనలో ముఖ్యుడు శాంతి స్వరూప్ భట్నాగర్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| విజయానికి చిరునామా (సింగిల్ టాస్క్ డే) | డా. నీరజ అమరవాది | 7 |
| మేలుకొలుపు | కూచిమంచి నాగేంద్ర | 8 |
| రిధిమా పాండే | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| చెడు స్నేహం (కథ) | బి. అంజలి | 11 |
| వేమన పద్యాలు | | 12 |
| ష్.. బయటకు వెళ్లొద్దు (కథ) | వడ్డేపల్లి వెంకటేశ్ | 13 |
| ఎలుకలు తిన్న త్రాసు కథ | పంచతంత్ర కథ | 14 |
| బంగారు మర్రి - 9 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| ఖాళీ స్థలంలోనే కదా వేసింది (కథ) | అనిశెట్టి సతీష్‌కుమార్ | 17 |
| హైదరాబాద్‌లో పఠన సంస్కృతి పునరుజ్జీవం | | 18 |
| తెలంగాణ చారిత్రక పర్యాటకం కొండాపూర్ | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| నన్ను ముట్టుకోకోయ్ (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| పళ్ళు పుచ్చిపోతాయి (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| ఆ అద్భుతమైన శాస్త్రవేత్తలిద్దరు అపూర్వమైన మిత్రులు! (సైన్స్ వెన్నెల-16) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| రావి చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| మన ఆలోచనలే (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| జాతీయ వేదికపై మెరిసిన తెలంగాణ కరాటే వీరులు (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| IIT ఢిల్లీ స్కూల్ యూత్ ఐడియాథాన్‌లో టీమ్ 'అగ్రోనెక్స్ డ్రీమర్స్' - టాప్ 125 ఘనత | | 28 |
| అమ్మ భాషకు జయహో!(కథ) | డా. ఉప్పల పద్మ | 29 |
| గుడ్డి కొంగ (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 30 |
| వెండి గిట్ట (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| కొంగలూ, తాబేలు (పిల్లల కథల్లో సైన్స్ -1) | - కె శ్రీకృష్ణ సాయి | 33 |

రెండు వేల ఏండ్ల కింద హిందూ మతం (చరిత్ర పాఠాలు-12) ...................... డా. ద్యావనపల్లి సత్యనారాయణ .......... 35
మేత... మోత... (పాట)... ..................................................... గంగదేవు యాదయ్య...................... 36
సంప్రదాయ నృత్యంలో మెరిసిన త్రివర్ణ సౌందర్యం .......................................................................... 36
కాగితం గొట్టం నుండి స్టెతస్కోపు ................................................ బాల కథా సౌరభం ...................... 37
నీవెంటే నేను (మాథ్స్ ట్రిక్స్) ................................................ అంకెల మామయ్య చంద్రయ్య ........... 38
చెలిమి క్లబ్. ............................................................... బాలచెలిమి ............................. 38
కృత్రిమ మేధస్సులో కంప్యూటర్ విజన్ పాత్ర (విద్య) ............................ లత.......................................... 39
లాజికల్ రీజనింగ్& ఆల్ఫాబెట్ టెస్ట్ ...................................... బాలచెలిమి డెస్క్ .......................... 41
నేర్చుకుందామా..................................................................................................................... 42
కలం-చెలిమి ......................................................................................................................... 42
భారత రాజ్యాంగ షెడ్యూల్‌లు పరిపాలనా వ్యవస్థకు పునాది (జి.కె.) ................ బాలచెలిమి డెస్క్ .......................... 43
పిండి పదార్థాలు ఎక్కువ మాంసకృత్తులు తక్కువ ఉంటున్నాయి...................... డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి........... 44
కల నిజమాయెగ (కథ)... ..................................................... సింగంపల్లి శేష సాయి కుమార్........... 45
రంగుల రెక్కల హిమాలయ పక్షి 'స్కేటర్ మోనాల్'.................................. సచిన్ కోత్వాల్ .......................... 46
"బాల చెలిమి గ్రంథాలయం" (పాఠశాల విద్యార్థుల కోసం నూతన విజ్ఞాన కేంద్రం) బాలచెలిమి డెస్క్ .......................... 47
బాల చెలిమి సృజన - వినూత్న ఆవిష్కరణ ........................................ బైతి దుర్గయ్య............................ 48
సమాచారం .......................................................................................................................... 49
స్వరసాధనలో తపస్వి..అమరగాన యోగి... ఘంటసాల వెంకటేశ్వర రావు (వ్యక్తిత్వం) ... సువేగా .................................... 50


# చెలిమి లేఖలు

యువత రాసిన పిల్లల కథల పుస్తకంలో 28 కథలు ఉన్నాయి. ఇందులో ప్రతి కథలో ఒక నీతి ఉంది. ఈ పుస్తకం విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంది. కథలు మళ్ళీ మళ్ళీ చదివించేలా ఉన్నాయి. ఈ కథలు ఆత్మ విశ్వాసం పెంచేలా ఉన్నాయి.

**- వి. రిత్విక్,** 9వ తరగతి

బాలచెలిమి అనేది పిల్లల సృజనాత్మకతకు అద్దం పట్టే ఒక విలువైన బాలసాహిత్య పత్రిక. నైతిక విలువలు, సామాజిక బాధ్యత, ప్రకృతి ప్రేమ, స్నేహ భావం వంటి అంశాలు కథల్లో సహజంగా నిక్షిప్తమై ఉండడం విశేషం. ఇది పిల్లలను కేవలం వినోదం వైపు మాత్రమే కాకుండా, జీవన విలువల వైపూ దారి తీస్తుంది. భవిష్యత్ తరాలకు మంచి పాఠకులను, ఉత్తమ రచయితలను అందించడంలో ఈ పత్రిక పాత్ర ఎంతో ప్రశంసనీయం.

**- సత్యనారాయణ,** కొండగట్టు

పిల్లలు రాసిన పిల్లల కథలు - 4లో మొత్తం 24 కథలున్నాయి. అందులో 16 కథలు అమ్మాయిలు వ్రాసారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వ్రాసిన కథలు ఎక్కువ. ప్రకృతి, పర్యావరణం, మొక్కల రక్షణ లాంటి అంశాలు ఉన్నాయి.

**- బి.అఖిల,** 8వ తరగతి

పెద్దలు రాసిన పిల్లల కథలు - 2 పుస్తక ముఖ చిత్రం చాలా బాగుంది. 96 పేజీలతో 24 కథలు చిత్రాలతో సహా ఉన్నాయి. పిల్లల కోసం పెద్ద పెద్ద రచయితలు వ్రాసిన కథలు బాగున్నాయి.

**- బి.తనూ శ్రీ,** 8వ తరగతి

*Cover Picture*
Shivansh School of Arts
Bharatanatyam Performance
Featuring
Nethra • Nandika • Anvi Sain

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728




సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713


# చదువు అన్ని భయాలనూ తొలగిస్తుంది

పిల్లలూ....

'కోటి విద్యలూ కూటి కొరకే' – ఈ మాట వినే వుంటారు. ఈ కోటి విద్యల్లో చదువు కూడా ఒకటి. అందరికీ అన్ని విద్యలూ రావు. అందరూ చదువుకోకపోవచ్చు. కాని ప్రతి ఒక్కరికీ ఏదో ఒక విద్య రావడం తప్పనిసరి. ఏ విద్యా రానప్పుడు బతుకు కష్టమవుతుంది. వ్యవసాయం, బట్టలు నేయడం, పాత్రలు తయారు చేయడం, ఇళ్ళు కట్టడం, వాహనాలు నడపటం వంటి అనేక విలువైన విద్యలకు చదువు రానక్కర్లేదు. చదువు కూడా ఉంటే అన్ని పనుల్లోనూ నైపుణ్యం అలవడుతుంది. ఆ విద్యలకు అవసరమైన సాంకేతిక జ్ఞానం చదువు వల్ల సాధ్యమవుతుంది.

ఆధునిక కాలంలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతూ శాఖోపశాఖలుగా విస్తరించి ప్రత్యేక అధ్యయన అంశాలుగా నిర్మితమవుతుంది. అందరికీ అన్నిటా ప్రావీణ్యం సాధ్యం కాదు కాబట్టి ఆయా అంశాలకు ప్రత్యేక నిపుణులుగా కొందరు ప్రాధాన్యత పొందుతారు. ఉదాహరణకు వైద్య రంగంలో ప్రతి అవయవానికీ, ప్రతి వ్యాధికీ వేర్వేరు డాక్టర్లు ఉండటం మనకు తెలుసు. అలాగే విద్యారంగంలోనూ ప్రతి సబ్జెక్టుకూ ప్రత్యేక ఉపాధ్యాయులు లేదా బోధకులు ఉండటం తెలుసు.

ఈ నేపథ్యంలో చదువుకి ఉన్న ప్రాధాన్యతను గుర్తించాలి. ఏ విద్యకైనా ప్రపంచం గురించి, ప్రకృతి గురించి, సమాజంలోని భిన్న అంశాల గురించి విషయ పరిజ్ఞానం అవసరం. ఆ జ్ఞానాన్ని చదువు యిస్తుంది. మీరు చిన్న పిల్లలు. కాని అఆలు రాకముందు నుంచే మీకు మీ పరిసరాలను, మీకు అవసరమైన వాటిని గుర్తించడం, అర్థం చేసుకోవడం, వాటిని సాధించుకోవడం తెలుసు. ఇప్పుడు మీరు చదువుకుంటున్నారు. చదువంటే భయపడకండి. చదువంటే ఏమిటో, చదువు ఎందుకో, చదువుకోవడం ఎట్లానో మీ వయసు పెరిగేకొద్దీ మీకు అర్థమవుతుంది.



కంటితో చూడలేని ప్రపంచాన్ని చదువు వల్ల చూడొచ్చు. అర్థం చేసుకోవచ్చు. మంచి చెడులు విశ్లేషించుకోవచ్చు. ప్రపంచాన్ని మనం కోరుకున్నట్లుగా మార్చుకోవచ్చు. చదువుకి యింత శక్తి వుంది. మీకు ఒక కొత్త విషయం తెలిసినప్పుడు, అది అర్థమైనప్పుడు ఎంత అద్భుతంగా వుంటుందో, ఎంత ఆనందంగా వుంటుందో, స్నేహితులతో పంచుకోవాలనిపిస్తుందో మీకు అనుభవమే.

మీరు మన భాషలో వున్న పదాలలో సాధ్యమైనన్ని నేర్చుకోవాలి. వాటి అర్థాలు, అవి ఏ సందర్భంలో ఉపయోగించాలో తెలుసుకోవాలి. మీకు అర్థమైన విషయాలను, మీకు చేతనైనట్లుగా స్వయంగా రాయాలి. దీనివల్ల మీ పదసంపద పెరుగుతుంది. ఊహాశక్తి పెరుగుతుంది. వ్యక్తీకరణ సామర్థ్యాలు మెరుగవుతాయి. మీ ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలి.

మార్కులు మీ తెలివికి కొలమానం కాదు. ఎప్పుడైనా మార్కులు తక్కువ వస్తే అధైర్య పడకూడదు. అభిరుచి, ఆసక్తి, అర్థం చేసుకునే శక్తి, కష్టపడే గుణం, అభ్యాసం, సాధన ఉంటే చాలు. మీరు అన్నీ నేర్చుకోగలుగుతారు. చదువు మీకు అన్నీ నేర్పుతుంది.

చదువు అన్ని భయాలనూ తొలగిస్తుంది.

మీ
వేదకుమార్.యం
(మణికొండ వేదకుమార్)
ఎడిటర్ బాలచెలిమి



# CSIR స్థాపనలో ముఖ్యుడు శాంతి స్వరూప్ భట్నాగర్



Shanti Swaroop Bhatnagar
21 Feb 1894 – 1 Jan 1955
First Director-General of CSIR & First Chairman of the UGC

స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి పునాది వేసిన శాస్త్రవేత్తలలో ప్రముఖుడు శాంతి స్వరూప్ భట్నాగర్. భట్నాగర్ 1894 ఫిబ్రవరి 21న బ్రిటిష్ ఇండియాలోని పంజాబ్ రాష్ట్రంలోని భేరా గ్రామంలో జన్మించారు. పసితనంలోనే తండ్రిని కోల్పోయాడు. ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్ షహార్‌లో తాత గారింట పెరిగాడు. తాతగారి ప్రోత్సాహంతో గణితం, ఇంజనీరింగ్ పట్ల ఆసక్తి పెరిగింది. జ్యామితి, ఆల్జీబ్రా అధ్యయనం చేసారు.

బ్యాటరీలో ఉపయోగించే కార్బన్ ఎలక్ట్రోడ్లకు ప్రత్యామ్నాయం తయారు చేసే విధానంపై 1911లో లీడర్ పత్రికకు లేఖ రాసారు. మెట్రిక్యులేషన్, ఇంటర్ మీడియట్ ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. ఫార్మన్ క్రిస్టియన్ కాలేజి నుండి బి.యస్.సి., ఎం.ఎస్.సి. పూర్తి చేసారు. లండన్ యూనివర్సిటీలో నూనెల ఉపరితల ఉద్వేగంపై పరిశోధన చేసి డి.యస్.సి. డిగ్రీ సాధించారు.


1921లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరాడు. 1924 నుంచి 1940 వరకు లాహోర్ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర ప్రయోగశాలల డైరక్టర్‌గా పని చేసారు. పారిశ్రామిక, అనువర్తిత రసాయన శాస్త్ర సమస్యలపై పరిశోధనలు నిర్వహించారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి (సిఎస్ఐఆర్) స్థాపనలో కీలక పాత్ర పోషించారు. భట్నాగర్ నేతృత్వంలో 12 జాతీయ ప్రయోగశాలల స్థాపన జరిగింది. 40కి పైగా ప్రయోగశాలలలో పరిశోధనకు సిఎస్ఐఆర్ కేంద్రంగా ఉంది.

భట్నాగర్‌కి బ్రిటిష్ ప్రభుత్వం నైట్ బిరుదును ప్రదానం చేసింది. రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యారు. 1954లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించింది. భట్నాగర్ 1955లో మరణించారు.

1958 నుంచి సిఎస్ఐఆర్ భారత దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేసిన వారికి భట్నాగర్ పేరిట అవార్డులు యిస్తోంది. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, జీవవైద్య శాస్త్రం రంగాలలో విశేష కృషి చేసిన 45 సం॥ లోపు శాస్త్రవేత్తలను ఈ అవార్డు కోసం ఎంపిక చేస్తుంది. ప్రతి విభాగానికి 5 లక్షల నగదు, ప్రశంసాపత్రం యిస్తారు. 1922లో హైద్రాబాద్‌లోని సెంటర్ ఫర్ డిఎన్ఎ, ఫింగర్ ప్రింటింగ్, అండ్ దయాగ్నస్టిక్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్న మద్దిక సుబ్బారెడ్డి గారికి జీవశాస్త్ర విభాగంలో ఈ అవార్డు లభించింది. కష్టపడి చదవడం, పరిశోధనలపై ఆసక్తి, దేశాభివృద్ధికి శాస్త్రాన్ని వినియోగించడం వంటి విలువలను నేర్పించే ఆదర్శంగా, ప్రేరణగా భట్నాగర్ జీవితం నిలుస్తోంది.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998




# విజయానికి చిరునామా

హాలో చిన్నారులూ ఎలా ఉన్నారు. కొత్త సంవత్సరంలో రక రకాల పరీక్షలతో సతమతమవుతున్నారా. మీరు సాధించాల్సిన, చేయాలనుకున్న పనులతో క్షణం తీరిక లేకుండా అలిసిపోతున్నారా. మీ కోసమే కొన్ని చిట్కాలను తీసుకొచ్చాను. మీ లక్ష్యాలని సులభంగా చేరుకోవాలంటే ముఖ్యంగా కావలసినది ఏకాగ్రత. అంతేకాదు ఒకే విషయం పై మనసు పెట్టి పని చేయాలి. మీరు ఏ రంగంలోనైనా, ఎవరినైనా గమనించండి. విజయాలను సాధించాలంటే లక్ష్యాలు కూడా మీకు తగినట్లుగా, సాధించగలిగేలా ఉండాలి. ఇదంతా ఇప్పుడు ఎందుకనుకుంటున్నారా! ఈతరం పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఉత్సాహపడుతున్నారు. భిన్న అభిరుచులు ఉన్నప్పుడు దేనికి ఎంత సమయం కేటాయించాలో తెలియక విద్యార్థులు చాలా ఒత్తిడికి గురవుతున్నారని ఒక పరిశీలనలో తెలిసింది. ఈ ఒత్తిడి వల్ల విద్యార్థులు కొత్త కొత్త మానసిక సమస్యల బారినపడుతున్నారు. అందుకే 2000 సంవత్సరం నుండి ఫిబ్రవరి 22వ తేదీని "సింగిల్ టాస్క్ డే" గా పిలుస్తూ ప్రజలలో దాని గురించి అవగాహన కలిగిస్తున్నారు.

"Be like a postage stamp, stick to one thing. Until you get there". - Josh billings.

విద్యార్థులు మల్టీటాస్క్ వల్ల ఒక లక్ష్యం నుండి మరో లక్ష్యానికి మారేటప్పుడు వచ్చే ఒత్తిడి వల్ల ఐక్యూ పడి పోతోందని, మెదడు దెబ్బ తింటోందని స్టాంఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి చెప్పారు. "ఒకే బాణం మూడు పిట్టలు" అన్న ఆలోచన మానుకోవాలి. అనుకున్న లక్ష్యం / విజయం సాధించేందుకు సమయం పెట్టాలి. ప్రాధాన్యత లేని విషయాలకు 'నో' చెప్పగలగాలి. చిన్న వయసులోనే ఎవరెస్టును అధిరోహించిన 'మాలావత్ పూర్ణ' గాని, చదరంగంలో ఆసక్తి పెంచుకొని, పిన్న వయసులోనే గ్రాండ్ మాస్టర్ అయిన 'దొమ్మరాజు గుకేష్' అయినా వారు సాధించాల్సిన లక్ష్యాలను నిర్ణయించుకున్నారు. దాని కోసం కృషి చేసారు. సాధించారు. మీరు కూడా ఏదైనా సాధించాలనుకుంటే ముందుగా మీ ఆసక్తి, లక్ష్యాల గురించి రాసుకోండి. లేదా ఎవరితోనైనా చెప్పండి. ఎంత వరకు దాన్ని సాధించగలుగుతామో అని ఆలోచించుకోండి. దాని కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించండి. మారథన్ పరుగు లాగా విజయాన్ని సాధించేంత వరకు పట్టు వదలద్దు. మీకు ఇష్టమైన రంగంలో సక్సెస్ అయిన వారి గురించి తెలుసుకోండి. మీరు కూడా ఆ లక్ష్యసాధన కోసం ఎలా పాటుపడాలో తెలుసుకోగలుగుతారు. మీదైన శైలిలో మీరు కృషి చేయచ్చు. ప్రతి లక్ష్యానికి ఒక డెడ్‌లైన్ పెట్టుకోండి. కొన్ని ఒక రోజులో

చేయాల్సినవి, వారంలో చేయాల్సినవి, అలాగే నెల, సంవత్సరం... ఎందుకంటే ఆశయసాధనకు నిర్ణీత సమయం పెట్టకోవాలి. లేకపోతే పగటి కలలాగా ఆలోచనలలోనే ఉండిపోతుంది. సాధ్యమైనంత వరకు నేను చేయలేను, నా వల్ల కాదు లాంటి నెగటివ్ ఆలోచనలకు దూరంగా ఉండండి. మీ లక్ష్యానికి బద్ధకం శత్రువు లాంటిది. తరువాత చేద్దాంలే అనే వాయిదా మనస్తత్వాన్ని వదిలివేయండి.

పిల్లలూ ఇది మీ వార్షిక పరీక్షల సమయం కదా. అందరూ ఒక లక్ష్యంతో బాగా చదవండి. కేవలం చదువు, ఉద్యోగాల వేటలో పడి కొట్టుకుపోకండి. ప్రతి ఒక్కరు చదువుతో పాటు అభిరుచి ఉన్న కళలు, ఆటలు లాంటి రంగాలలో ప్రావీణ్యం సాధించాలి. పేరు తెచ్చుకోవాలి. ఆ దిశగా ఆలోచించి మీ వేసవి సెలవులలో దానికి తగ్గ ప్రణాళికలను సిద్ధం చేసుకోండి.

"Don't make resolutions, build habits",

– డా. నీరజ అమరవాది
m : 9849160055

# మేలుకొలుపు




"అమ్మా! నాన్నా! రేపు ఉదయం రెడీగా ఉండండి. మనం ఒక ముఖ్యమైన చోటికి వెళ్లాలి" అంటూ భుజాన ఉన్న బ్యాగును సోఫాపై వేస్తూ చెప్పాడు సాకేత్. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న సాకేత్ మాటల్లో ఓ బాధ్యతాభావం కనిపించింది.

"రేపు ఆదివారం కదా! ఎక్కడికి వెళ్లేది?" అని తల్లి వసంత ఆశ్చర్యంగా అడిగింది.

"స్కూల్లో ఉచిత వైద్య పరీక్షలు జరుగుతున్నాయి అమ్మా. ముఖ్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు. మాస్టారు తప్పకుండా అందరూ చేయించుకోవాలని చెప్పారు" అన్నాడు సాకేత్.

"మనకి ఆరోగ్యం బాగానే ఉంది కదా!" అంది వసంత.

"అమ్మా! చెడు అలవాట్లు లేకున్నా క్యాన్సర్ రావచ్చు. జన్యుపరమైన కారణాలు, జీవనశైలి మార్పులు, ఊబకాయం వంటివి కారణమవుతాయి. ముందస్తు పరీక్షల వల్ల వ్యాధిని తొందరగా గుర్తించవచ్చు" అని వివరించాడు సాకేత్. వంట నూనెను మళ్లీ మళ్లీ వాడటం, ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని కూడా చెప్పాడు.

సాకేత్ మాటలకు ఒప్పుకున్న తండ్రి వివేకానంద, "రేపు తప్పకుండా వెళ్దాం" అన్నాడు. సంతోషించిన సాకేత్ స్నేహితుడు రఘుకు ఫోన్ చేసి ఇదంతా చెప్పాడు.

మరుసటి రోజు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం జనసంద్రమైంది. పెద్ద ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను ధైర్యంగా పరీక్షలకు తీసుకువచ్చారు. ఈ నిబద్ధత చూసి వైద్యులు, ఉపాధ్యాయులు ఆనందించారు.

"మంచి ఆహారం, వ్యాయామం, యోగా, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించడం ఆరోగ్యానికి మేలు" అని చీఫ్ డాక్టర్ సూచించారు.

"మేము చదువుతో పాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇస్తాం" అన్నాడు సాకేత్.

– కూచిమంచి నాగేంద్ర
m : 91821 27880

# రిధిమా పాండే

## చిన్న పనులు - పెద్ద ప్రభావాలు

రిధిమా పాండే (2008 –) ఉత్తరాఖండ్‌లో పుట్టారు. పర్యావరణ కార్యకర్తగా చిన్నతనంలోనే టెడెక్స్‌లో ప్రసంగించారు. సొంత రాష్ట్రం ఉత్తరాఖండ్ వరదలు, కొండ చరియలు విరిగిపడటం లాంటి ఘటనలు చిన్నతనంలోనే ఆమెను పర్యావరణ కార్యకర్తగా మార్చాయి. పారిస్ ఒప్పందంలో అంగీకరించినట్లుగా భారత ప్రభుత్వం వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తూ తొమ్మిదేళ్ల వయసులోనే ఆమె కోర్టులో కేసు దాఖలు చేశారు. జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్లో తన కేసును తానే వాదించుకునేలా ఆమె నిబద్ధత పురిగొల్పింది. వాతావరణ మార్పుల ప్రభావాలు ఎదుర్కోవడానికి ఒక జాతీయ విధానం ఉండాలని ఆమె బలంగా వాదించారు.




2019లో అమెరికా, న్యూ యార్క్‌లో జరిగిన ఐక్య రాజ్య సమితి పర్యావరణ కార్యాచరణ సదస్సులో పాల్గొని వివిధ దేశాల నుంచి వచ్చిన యువ పర్యావరణ కార్యకర్తలతో కలిసి ఆమె నినదించారు. 'భారత దేశ గ్రెటా థన్‌బెర్గ్'గా ఆమె గుర్తింపు పొందారు. న్యాయ పోరాటాలు, అంతర్జాతీయ సదస్సులు మాత్రమే కాదు, క్షేత్ర స్థాయి కార్యాచరణలో కూడా రిధిమా చురుకుగా పాల్గొంటారు. పర్యావరణ ఉద్యమాలకు ఆమె నాయకత్వం వహించారు. పర్యావరణ సమస్యలపై ఉపన్యాసాలు ఇచ్చారు, పరిష్కారాల కోసం కృషి చేశారు.

రాబోయే తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాలనే పట్టుదల, కృషి ఆమెకు గుర్తింపు తెచ్చాయి. బీబీసీ 100 మంది మహిళల జాబితాలో ఆమె చోటు దక్కించుకున్నారు. సామాజిక న్యాయం కోసం కృషి చేసే వారికి ఇచ్చే మదర్ థెరెసా స్మారక పురస్కారాన్ని ఆమె అందుకున్నారు.

వయసుతో సంబంధం లేకుండా ఒక వ్యక్తి సాగించే కృషి ప్రభావవంత మార్పునకు ఎలా దారి తీస్తుందో రిధిమా జీవితమే ఉదాహరణ. పిల్లల స్వరం కూడా ముఖ్యమే అని, మెరుగైన సమాజం కోసం పిల్లలూ కృషి చేయగలరని రిధిమా నిరూపించారు.

– 'షీరోస్–256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

'ది లెటర్' అనే చిత్రంలో రిధిమా నటించారు.
(https://www.theletterfilm.org)

# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం



'బలము'తో బండను ఎత్తినవా?
'బలపం'తో పలక మీద రాశారా?
బలబల తెల్లారింది బాలలు చూశారా?
'బడి'లో మొదటి అక్షరమేది? "బ" అక్షరం



భర్త, భార్యలంటే సీతారాముల జంట
భజన చేయును భక్తితో రాముని భంటు
భంబులో ఉరిమితె భయమవుతుంది
"భవము" లో ముందున్న అక్షరమేది? "భ" అక్షరం



మందిరంలో మందారం మంచిగ పూసింది
మంగళ సూత్రం మమతల మహిమలు తెలుసా?
మండూకం మంచం మీదికి దూకింది
"మందారం"లో ముందు ఏ అక్షరముంది? "మ" అక్షరం



యతి యజ్ఞం జేసి యశమును పొందాడు.
యమునా నదిలో యతులు స్నానం చేశారు.
యముడంటే యమధర్మరాజని తెలుసా?
"యజ్ఞం"లో మొదటి అక్షరమే ముంది? "య" అక్షరం




రంగు రంగుల పూలు రగరగ మెరిసెను
రతనాలు పొదిగిన రథము మెరిసెను
రక్కసుల నణచిన రాముని కథ తెలుసా?
"రంగవల్లి"లో ముందున్న అక్షరమేది? "ర" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ

# చెడు స్నేహం



ఒక గ్రామంలో రామయ్య సీతమ్మ అనే దంపతులు ఉండే వారు. ఆ దంపతులకు ఒక్కగా నొక్క కుమారుడు పేరు దుర్గ. అదే ఊర్లోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాలలో అదే తరగతి లోని ప్రసాద్ అనే అబ్బాయితో స్నేహం ఏర్పడింది.

ఇద్దరూ పాఠశాలకు కలిసి వెళ్ళటం, కలిసి భోజనం చేయటం, కలిసి ఆట్లాడుకోవడం ఇలా చక్కని స్నేహితులుగా తయారయ్యారు. ఉపాధ్యాయులు, ఇతరులు వారి స్నేహాన్ని చూసి స్నేహితులంటే ఇలా ఉండాలి చక్కగా చదువుకుంటూ అందరికీ ఆదర్శంగా ఉన్నారు అంటూ పొగిడేవారు.

తర్వాత కొంత కాలానికి అదే పాఠశాలలోకి సురేంద్ర అనే అబ్బాయి చేరాడు. తన మాటలతో స్నేహం చేశాడు. సురేంద్ర తో స్నేహం చేసిన తర్వాత దుర్గలో ప్రసాదు కొన్ని మార్పులను గమనించాడు. అయితే ఆ మార్పులు కోరుకునేవి కాదు. చెడు మార్పులు. నెమ్మదిగా సురేంద్రకు చెడలవాట్లు చాలా ఉన్నాయని ప్రసాద్‌కు తెలిసిపోయింది.

దుర్గతో “దుర్గా! నీవు సురేంద్ర తో స్నేహం చేయటం మానేయాలి. ఎందుకంటే సురేంద్రకు చాలా చెడు అలవాట్లు ఉన్నాయి. దానివల్ల నష్టపోయేది మనమే” అంటూ హెచ్చరించాడు. దుర్గ ‘అలాగే అలాగే’ అన్నాడు. కానీ మనసులో మాత్రం సురేంద్ర తోనే స్నేహం చేయాలని అలాగే ఎంజాయ్ చేస్తూ తిరగాలని కోరికగా ఉంది.

అందుకే ప్రతిరోజు సాయంత్రం ఇంట్లో ప్రసాద్ దగ్గరికి వెళ్లి చదువుకుంటానని అబద్దం చెబుతూ దుర్గ సురేంద్ర దగ్గరికి వెళ్ళేవాడు. షికార్లు తిరిగేవాడు. క్రమంగా తెలిసిన వాళ్ళ దగ్గర అప్పులు చేస్తూ జల్సాలు చేసుకునేవాడు. ఇది ఇలా పెరిగిపోయి చివరకు మత్తు పదార్థాలకు బానిస కూడా అయ్యాడు.

ఇంట్లో వారికి కొద్ది రోజులకు దుర్గ అబద్ధం ఆడుతున్నాడని, ప్రసాద్‌తో కలిసి తిరగకుండా సురేంద్రతో తిరుగుతూ, చెడు అలవాట్లకు బానిస అయ్యాడని తెలుసుకొని చాలా బాధ పడ్డారు. సురేంద్రతో తిరగవద్దని అలా జీవితం నాశనం చేసుకోవద్దని చెప్పారు.

హెచ్చరించారు. చివరకు కొట్టారు కూడా.... అయినా దుర్గ మారలేదు.

దాంతో దుర్గను ఏమీ చేయలేక ప్రసాద్ ను ఇంటి వద్దకు పిలిపించుకున్నారు. "ప్రసాద్ దుర్గతో నీవైన మాట్లాడి వాడిని ఎలాగైనా మార్చే ప్రయత్నం చేయి. మేము ఎంత కష్టపడినా వాడు మారడం లేదు. వాడు మత్తు పదార్థాలకు బానిసవుతుంటే మేము చూడలేక పోతున్నాం. నీ మాట వింటాడేమో ఒక్కసారి ప్రయత్నం చేయి. చిన్నవాడివైనా నిన్ను ప్రాధేయ పడుతున్నాం. ఈ ఒక్క సహాయం చేయి" అంటూ ప్రాధేయపడ్డారు దుర్గ అమ్మనాన్న.

"అయ్యో అంకుల్! దుర్గ చెడిపోవడం నాకు ఇష్టమా? లేదు కదా! నేను వాడితో మాట్లాడి చూస్తాను. మీరేం భయపడకండి. కంగారు పడకండి" అని చెప్పి మర్నాడు దుర్గ దగ్గరకు వెళ్లి మాట్లాడాడు.

"దుర్గా నీకు ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. మత్తు పదార్థాలకు బానిస కావటం వల్ల తల్లిదండ్రులు బాధ పడటమే కాదు నీ జీవితం కూడా నాశనం అవుతుంది. మనం వివిధ రకాలుగా నష్టపోతాం. కాబట్టి దీన్ని మానుకో" అని నచ్చచెప్పుతూ ఉండగానే దుర్గ కళ్ళు తిరిగి పడిపోతాడు. వెంటనే ప్రసాద్ హాస్పిటల్ తీసుకెళ్తాడు. తర్వాత దుర్గ తల్లిదండ్రులు కూడా హాస్పిటల్‌కి వచ్చారు.

పరీక్షలు అన్నీ చేసిన తర్వాత డాక్టర్ గారు "చూడండి తీవ్రంగా మెదడు, నాడులు మత్తు పదార్థాల ప్రభావానికి గురి అయ్యాయి. ఇకనుంచి ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోకుండా జాగ్రత్తగా మందులు వాడితే తప్ప బ్రతకడం కష్టం" అని చెప్పాడు. దాంతో దుర్గ తల్లిదండ్రులు ఏడుస్తూ ఉంటే దుర్గ "అమ్మా! నాన్నా! నన్ను క్షమించండి. మీరు ఎంత చెప్పినా, ప్రసాద్ చెప్పినా వినకుండా చెడు స్నేహాన్ని చేసి ఇలా నా ప్రాణం మీదకు తెచ్చుకున్నాను. మీకు ఇబ్బంది కలిగించాను. ఇకనుంచి జాగ్రత్తగా మంచిగా ఉంటాను. నన్ను ఈ ఒక్కసారి క్షమించండి" అంటూ కన్నీరు కార్చాడు.

– బి. అంజలి
6వ తరగతి, జి.ప.ఉ.పాఠశాల, ఎన్.ఎన్.కాలనీ,
డోను–518222, నంద్యాలజిల్లా
m : 9490565568

శతకం


# వేమన పద్యాలు

**మేక కుతక బట్టి మెడ చన్ను కుడువగా**
**ఆకలేలమాను నాశగాక**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : మేక మెడ క్రింద నుండు చన్నును నోటిలో పెట్టుకుని కుడిచినచో ఆకలి తీరదు. అట్లే లోభి వానిని అడిగినచో ఏమియూ లభించదు.


**ఆశ కోసివేసి యనలంబు చల్లార్చి**
**గోచిబిగయ కట్టి గుట్టుదెలిసి**
**నిలిచినట్టివాడే నెర యోగి యెందైన**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : ఆశ వదలి, ఆశయను అగ్నిని చల్లార్చుకొని, కామము వదలి గోచి బిగించినట్టి, జ్ఞానము తెలుసుకొనేవాడే నేర్పరియైన యోగి.



కథ

# ష్.. బయటకు వెళ్లొద్దు




ఓ అడవిలో ఉండే కుందేళ్ళ గుంపు అభద్రతా భావానికి గురైంది. కారణం ఏంటి అంటే ఆ అడవిలో నిత్యం పులుల నుండి, సింహాల నుండి, తోడేళ్ళ నుండి ప్రాణాపాయం ఎదురుకావడమే ఇందుకు కారణం. బయటికి వెళ్తే తిరిగి ఇంటికి చేరుకుంటామో లేదో అనే భయం వాటిని నిత్యం వెంటాడుతూ ఉండేది. అందుకే పిల్లల్ని అసలు బయటకు వెళ్లనిచ్చేవి కావు. కానీ పిల్ల కుందేళ్ళేమో బయట ఆడుకోవాలని గొడవ చేసేవి. "ష్.. బయటకు వెళ్లొద్దు" అంటూ వాటిని ఇల్లు దాటనిచ్చేవి కాదు పెద్ద కుందేళ్ళు.

ఓ రోజు పెద్ద కుందేళ్ళు అన్నీ ఆహారానికి బయలుదేరి అడవి సరిహద్దుకు చేరుకున్నాయి. అక్కడ సరిపడా ఆహారం దొరికింది వాటికి. ఇంతలో ఓ నక్క అక్కడికి వచ్చింది. కుందేళ్ళు భయపడ్డాయి.

"మిత్రులారా... భయపడకండి. నా పేరు సునేత్రిక. నేను మీ అడవి పక్క అడవిలో ఉంటాను. మా అడవి చాలా బాగుంటుంది. ఒకసారి రావొచ్చు కదా! మీకు ఇష్టమైన ఆహారం బోలెడు దొరుకుతుంది మా అడవిలో...!" అన్నది నక్క.

కుందేళ్ళు ఆశ పడ్డాయి. ఆ తరవాత ఆలోచనలో పడ్డాయి. నిర్ణయించుకోవడానికి ఒక రోజు సమయం అడిగాయి. నక్క సరేనని వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళాక కుందేళ్ళనీ సమావేశమై కొత్త అడవిలోకి వెళ్ళడమే మంచిదని తీర్మానించుకున్నాయి. అదే రోజు రాత్రి వేగంగా కొత్త అడవిని చేరుకున్నాయి. అక్కడి వాతావరణం కూడా బాగా నచ్చింది వాటికి. నక్క సహాయంతో మంచి స్థావరాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాయి. మరుసటి రోజు, కుందేళ్ళు వేటకు బయలు దేరుతుండగా ఒక కోతి అక్కడకు చేరుకుంది.

"మిత్రులారా... మీరు ఈ అడవికి కొత్తలా ఉన్నారే! ఏది ఏమైనా మీకు ఈ స్థావరం సురక్షితం కాదు. వెంటనే ఈ స్థావరాన్ని వదిలి పారిపోండి. సునేత్రిక అనే నక్క మాయమాటలు చెప్పి అమాయక ప్రాణులను ఇక్కడికి తీసుకువచ్చి క్రూర మృగాలకు ఆహారంగా చేస్తుంది..." అని కోతి చెప్పగానే కుందేళ్ళన్నీ కోతికి ధన్యవాదాలు చెప్పి, ప్రాణ భయంతో తమ స్వంత అడవి వైపు పరుగులు తీశాయి.


వెనకాల నక్కతో పాటు పులులు తమని వెంబడించడం గమనించాయి. కానీ వాటికి అందకుండా తిరిగి క్షేమంగా తమ పాత స్థావరానికి చేరుకున్నాయి కుందేళ్ళు.

"హమ్మయ్య... పెద్ద గండం నుండి తప్పించు కున్నాం...." అని ఊపిరి పీల్చుకున్నాయి.

ఒక పెద్ద కుందేలు ఇలా అన్నది. "మనం ఎక్కడ ఉన్నా ప్రమాదం పొంచే ఉంటుంది. బయటకు వెళ్ళిన ప్రతీ సారి మనం అత్యంత జాగ్రత్తగా ఉండి ప్రాణాలు నిలుపుకోవడం ఒక్కటే మార్గం. అందుకు తగిన చాకచక్యం, నేర్పు, ఓర్పు మనతో పాటు మన పిల్లలకు కూడా నేర్పాలి. "ష్... బయటకు వెళ్లొద్దు" అంటూ పిరికితనం నూరి పోయకండి. లేదంటే పిల్లలకే కాదు, మన మనుగడకే కష్టం. ఈ రోజు నుండి పిల్లలకు కూడా ఆహార అన్వేషణ ఎలా చేయాలో నేర్పుదాము.'' అందుకు కుందేళ్ళనీ అంగీకరించాయి. ఇక భయాన్ని వీడిన కుందేళ్ళు సంతోషంగా జీవించాయి. "ష్... బయటకు వెళ్లొద్దు" అనే మాట ఎప్పుడూ వినిపించలేదు.


– వడ్డేపల్లి వెంకటేశ్
m : 99895 96554

# ఎలుకలు తిన్న త్రాసు కథ



ఒక పట్టణంలో ఒక ధనికుడు ఉన్నాడు. అతడికి వ్యాపారంలో నష్టం వచ్చి, ఆస్తిని అంతా పోగొట్టు కున్నాడు. పూలు అమ్మినచోట కట్టెలు అమ్మడం ఇష్టం లేక ఆ దేశం వదిలి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అతడి ఇంట్లో తాతల కాలం నాటి ఒక ఇనుప త్రాసు ఉండేది. అది చాలా మంచిది. అటువంటి త్రాసు దొరకడం చాలా కష్టం. ఆ త్రాసును వదులుకోవడం అతడికి ఇష్టం లేదు. దాన్ని తన స్నేహితుడైన ఒక వర్తకుని ఇంటిలో ఉంచి దేశ దేశాలు తిరిగాడు. చాలా ధనం కూడా సంపాదించాడు.

కొన్ని సంవత్సరాలు తర్వాత తిరిగి వచ్చి తన త్రాసును తనకు తిరిగి ఇవ్వమని ఆ వర్తకుణ్ణి అడిగాడు. కానీ వర్తకుడు ఆ త్రాసును కాజెయ్యాలని అనుకున్నాడు. "నీ త్రాసును ఎలుకలు తినేశాయి!" అని ఆ ధనికుడితో చెప్పాడు. "అలాగా! అయితే సరేలే!" అని ఆ తెలివి గల ధనికుడు అప్పటికి ఊరుకున్నాడు. కానీ ఆ వర్తకుడికి బుద్ధి చెప్పడానికి ఒక ఎత్తు వేశాడు. స్నానం చేయడానికి నదికి వెడుతూ ఆ వర్తకుడి కుమారుణ్ణి తనతో కూడా తీసుకుని వెళ్ళాడు. స్నానం చేసి తిరిగి వస్తూ ఆ పిల్లవాణ్ణి ఒకచోట దాచిపెట్టాడు. ఏడుస్తూ వర్తకుని దగ్గరకు వచ్చి, "నీ కొడుకుని గ్రద్ధ తన్నుకు పోయింది" అని చెప్పాడు.

అప్పుడు ఆ వర్తకుడు, "దుర్మార్గుడా! ఎక్కడైనా బాలుణ్ణి గ్రద్ద తన్నుకుపోతుందా?" అని న్యాయాధికారి దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. న్యాయాధికారి ఆ ధనికుణ్ణి పిలిచి, "గ్రద్ద బాలుణ్ణి ఎలా తన్నుకుపోగలదు?" అని అడిగాడు. ఆ మాటకు ఆ ధనికుడు "ఇందులో అనుమానపడవలసింది ఏమీ లేదు. ఈ నగరంలో ఇనుప త్రాసును తినే ఎలుకలే ఉంటే, బాలుణ్ణి ఎత్తుకు పోయే గ్రద్దలు ఉండవా?" అని అన్నాడు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు. న్యాయాధికారి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నాడు. వర్తకుడికి పిల్లవాణ్ణి, ధనికుడికి త్రాసుని ఇప్పించాడు.

**నీతి : తెలివి ఏ ఒక్కరి సొత్తు కాదు.**

సేకరణ : అమరావతి



సీరియల్-9

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

# బంగారు మర్రి

(గత సంచిక తరువాయి...)

బంగారుమర్రి దగ్గర జంతువులన్నీ సమావేశమయ్యాయి. అక్కడ కొత్త రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్నికలు జరుగుతున్నాయి. పులిరాజు ఎప్పటివలే ఆ అడవికి ప్రభువుగా మృగరాజు సింహాన్ని ప్రకటించింది. జంతువులు, పక్షులు మృగరాజును ఏకగ్రీవంగా అంగీకరించాయి. ఇక మంత్రి పదవి, ఇతర పదవులకు పోటీ ఏర్పడింది. దాంతో... ఎన్నికల హడావిడి మొదలయింది.

ఎంతో కాలంగా ఆ అడవిలో కేవలం జంతువులు మాత్రమే రాజ్యాన్ని పాలిస్తూ వుండేవి. పక్షులు అడవిలో నివసిస్తున్నపటికీ వాటికి ఇంతవరకు ఏ అధికారాన్ని ఇవ్వలేదు. పక్షులంటే చిన్న చూపు మొదటి నుంచీ వుంది. పక్షులు బలహీనమైనవి, రాజ్యాన్ని నడపటంలో వాటికి శక్తి సామర్థ్యాలు చాలవని మృగరాజుకు ఆలోచన వుండేది. శత్రువుని ఎదుర్కోవాలంటే మంచి కండబలం కావాలని...

అది పక్షులకు లేదని అభిప్రాయపడేది.

అడవిలో కొత్త రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్నికలు జరుగుతున్న విషయం పక్షులకి తెలిసిపోయింది. పక్షుల నాయకుడు గద్ద అడవిలోని పక్షులను సమావేశ పరిచింది. అన్నీ కలిసి ఎన్నికలు జరుగుతున్న ప్రదేశాన్ని చేరుకున్నాయి. మృగరాజు పక్షుల రాక గమనించాడు. పొలో మంటూ పక్షులన్నీ రావటంతో మృగరాజు కంగారు పడ్డాడు. గద్దను విషయం అడిగి తెలుసుకున్నాడు.

పక్షులన్నీ అక్కడే వున్న వృక్షాల మీద వాలాయి.

"రాజా! మీరు ఎప్పుడూ సమైక్య వాదం... సమైక్య వాదం అంటుంటారే! మరి మీ దృష్టిలో పక్షి జాతి మీద చాలా చిన్నచూపెందుకు?!" అంటూ ప్రశ్నించింది గద్ద. మృగరాజు పెద్దగా నవ్వాడు.

"చిన్న చూపు కాదు మిత్రమా! పక్షి జాతి, జంతు జాతితో పోల్చుకుంటే చాలా బలహీనమైనది. శక్తి సామర్థ్యాలు తక్కువ కలది. శత్రువుని ఎదురొడ్డి పోరాడలేవు. అందుకే మేము మొదటి నుంచి జంతుజాతినే రాజ్య పరిపాలనా సేవకులుగా తీసుకుంటున్నాము" అంది సింహం.

"మీరు అన్నది నిజమే మహారాజా! కానీ... రాజ్య పరిపాలనా అధికారులుగా మా పక్షి జాతి నుండి కూడా ప్రాధాన్యత కల్పించండి. మాకు చేతనవుననుకున్న పదవులే మాకు అప్పగించండి. మాకు ప్రధాన పదవులు ఏమీ అక్కరలేదు. కానీ మేము ఎందుకూ పనికి రాని వారిగా దూరం పెట్టకండి ప్రభూ!" అంటూ వేడుకుంది గద్ద.

దాని విన్నపం మృగరాజుతో పాటు, ఇతర జంతువులకు కూడా నచ్చలేదు. "సరే! మీరెళ్లి ఆ చెట్టు మీద కూర్చోండి. మొదట ప్రధాన పదవులు పూరించాక... మీ గురించి మెల్లగా ఆలోచిస్తాం!" అన్నాడు మృగరాజు.

గద్ద సంతోషంగా వెళ్ళి చెట్టు కొమ్మపై కూర్చుంది. రాజు ఆలోచిస్తానని అన్నందుకు పక్షులన్నీ హర్షం వ్యక్తం చేశాయి. అంతలో దూరంగా కొందరు వేటగాళ్ళు ఇటుగా రావడం గమనించింది గద్ద.

"మహారాజా! కొందరు వేటగాళ్ళు బలమైన ఆయుధాలతో ఇటుగా వస్తున్నారు" అంటూ చెట్టు మీదనుంది. అరచింది. దాంతో... జంతువులన్నీ తలో దిక్కులో జాగ్రత్త పడ్డాయి. శత్రువు రాక ముందుగానే పసిగట్టిన గద్దను అభినందించాడు మృగరాజు, పులిరాజు. మరుసటి రోజు సమావేశంలో మృగరాజు పక్షిజాతిని క్షమించమని. వేడుకున్నాడు. ఇంతకాలం పక్షులకు పదవులివ్వనందుకు సిగ్గుపడ్డాడు.. శత్రువు రాక దూరం నుండే పసి గట్టగల నేత్రాలు మాత్రమే కాకుండా. ధైర్యంగా తన గోర్లతో చీల్చి చెండాడ గల ధైర్యం వున్న గద్దకు సహాయ సైన్యాధికారి పదవిని, రామచిలకను ఆస్థాన జ్యోతిష్యునిగా, కోకిలమ్మను ఆస్థాన కవిగా, నెమలిని ఆస్థాన నాట్యగత్తెగా వెంటనే నియమించి... ఇతర పక్షులకు కూడా చిన్న చిన్న పదవులిచ్చి పక్షుల సేవలను కూడా వినియోగించుకోవాలనుకున్నాడు. దాంతో పులిరాజు కూడా సంతోషించాడు. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699


చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

కథ

# ఖాళీ స్థలంలోనే కదా వేసింది!



'అమ్మా...? ఈ ఇల్లు ఊడ్చిన చెత్తను ఎక్కడ వేయమంటావు.' అని ఇంటిని శుభ్రం చేసిన చెత్తను చేతిలో పట్టుకున్న రఘు వాళ్ళ అమ్మ ప్రగతిని అడుగుతాడు. రఘు వాళ్లు ఆ ఇంట్లో కిరాయికి వుండడానికి కొత్తగా వచ్చారు.

'ఆగు ఒక నిమిషం' అని చుట్టూ చూడడం మొదలు పెట్టింది ప్రగతి 'ముందు వైపు రోడ్డు వుంది. వేయలేము. వెనుక వైపు వేరే వాళ్ళ ఇల్లుంది అక్కడా వేయలేము. ఎడమ వైపు రేకుల షెడ్డు వుంది హ్మ్ అక్కడ కూడా వేయలేము. కుడి వైపు ఖాళీగా ఉంది. ఇది బాగుంది అరేయ్ రఘు ఆ చెత్తంతా ఈ కుడి వైపు వున్న ఖాళీ స్థలంలో వేసేయ్' అన్నది.

'అమ్మ ఈ స్థలం ఎవరిదో గొడవై పోద్దో ఏమో?' అని రఘు అన్నాడు. 'నీ మొహం గొడవ లేదంటే ఈ చెత్తను కిందకు దిగి ఆ సందు చివర వున్న చెత్త కుండీలో వేస్తావా ఏంటి? లేదా ఈ చెత్తను రేపు చెత్త బండి వచ్చే వరకు ఇక్కడే పెడతావా? రేపు ఉదయాన్నే ఈ ఇంట్లోకి వస్తున్నాం. మన వస్తువులు వచ్చేలోపు ఇల్లంతా శుభ్రం చేసి వుండాలి. అంతగా ఎవరన్నా గొడవకొస్తే అది మనది కాదు అని చెబుదాం. ముందు ఆ చెత్త అటు పారేయ్' అని అన్నది ప్రగతి. తన పేరులో వున్న ప్రగతి ఆలోచనల్లో మాత్రం లేనట్లుగా.

చేసేది లేక అమ్మ చెప్పిన మాట విని పక్కన ఖాళీ స్థలాన్ని ఇల్లు ఊడ్చిన చెత్తను వేసి చెత్తకుండీకి ప్రారంభోత్సవం చేశాడు రఘు. పైనుండి వేసిన చెత్తను కిందున్న కిరణ్ చూసి భార్య భారతితో 'ఏంటే పైన కిరాయికి వచ్చిన వారు మన పక్క ఖాళీ స్థలంలో చెత్తను వేశారు. ఇలా వదిలేస్తే రోజూ ఇలానే చేస్తారు. నువ్వెళ్లి వాళ్ళతో ఇక్కడ చెత్త వేయొద్దని చెప్పు.'

'మీరు కాస్త ఆగండి. వాళ్ళు ఇంకా ఇంట్లోకి కూడా రాలేదు. అప్పుడే ఇది చేయొద్దు, అది చేయొద్దు, ఇటెందుకు వేశారు, అందుకు వేశారు, ఇలా ఉండొద్దు, అలా ఉండొద్దు అని వాళ్ళకు చెబితే ఇంటి ఓనర్స్ ఏంటి ఇలా వున్నారని, ఇంట్లో అడుగు పెట్టకముందే ఇంతలా భయపెడుతున్నారు. ఇంట్లోకి దిగితే వీళ్ళతో ఇరకాటంలో పడ్డట్టే అని అటు నుంచి అటే పోతారు. అయినా వాళ్ళు వేసింది చెత్తేగా అది కూడా ఖాళీ స్థలంలోనేగా దానితో మనకేం నష్టం' అని భర్త ఒకటే అంటే ఒకటికి పది చేర్చి అన్నది భారతి.

'అది కాదే భారతి వాళ్లు అలా ఒకసారి చెత్త వేస్తే అదే అలవాటుగా మారుతుంది. అది చూసి ఇంకో పది మంది చెత్త వేస్తారు. ఆ చెత్తతో ఈగలు, దోమలు వాటితో రోగాలు కూడా వస్తాయే' అని హిత వచనాలు పలికాడు.

'చాల్లెండి మీరు మరీను నీడను చూసి నిప్పనుకుంటున్నారు. సెంటీమీటర్ దాన్ని కిలో మీటరు చేసి మాట్లాడుతున్నారు. వాళ్లేమైన రోజు వేస్తారా ఏంటి?' అని అన్నది భారతి.

తరువాతి రోజు ప్రగతి వాళ్లు పూర్తి వస్తువులతో దిగారు. పాత ఇంట్లోకే కొత్తగా వచ్చారని పాత చుట్టాల్నే భోజనానికి కొత్తగా రమ్మన్నారు. వచ్చిన చుట్టాలు తిని వెళ్లారు కానీ, వాళ్ళ తీపి గుర్తులు తిన్న ప్లేట్లు గంపెడు చెత్త తయారయ్యింది. అదంతా రఘు పక్క ఖాళీ స్థలంలో కాదు

కాదు తాను ప్రారంభించిన చెత్త కుండిలోకి వేసి దాని స్థాయిని పది మందికి తెలిసేలా చేశాడు.

అది చూసిన భారతి 'ఏంటండీ ప్రగతి గారు.' అని పక్కకు వేసిన చెత్తను చూపిస్తూ అడిగారు. 'కాదక్కా ఈ రోజే మొదటి రోజు కదా చుట్టాలు వచ్చారు. అందుకే కాస్త చెత్త ఎక్కువైంది. అందుకే....... అవును అక్క మీరు తిన్లేదు కదా రండి. నా చేతి కమ్మని వంట చూడండి' అని లోపలికి పిలవగా కమ్మని వంట అని విని చెత్తని మరిచి భారతి లోపలికి వెళ్ళింది.

రోజులు గడిచాయి భారతి వాళ్ళ ఇంటి పక్కన ఆ కాలనీ చెత్తకుండీ తయారయ్యింది. భారతి వాళ్ళ అడ్రస్ కూడా మారిపోయింది. చెత్త కుండి పక్క భారతిగా మారిపోయింది.

కొన్ని రోజుల తర్వాత భారతి వాళ్ళ ఇంట్లోని వాళ్ళందరికీ ఫ్యామిలీ ప్యాకేజిగా ఒకరి తరువాత ఒకరికి డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చాయి. భారతి భర్త కిరణ్‌కు రక్త కణాలు పడిపోయి బ్రతకడమే కష్టంగా మారింది. చివరికి పది లక్షలు ఖర్చయ్యాక అతి కష్టం మీద కిరణ్‌కు జ్వరం తగ్గి మామూలుగా మారిపోయాడు. వారిని చూసిన డాక్టర్ 'మీ ఇంటి చుట్టూ ఎక్కడో దోమలు బాగా ఉన్నట్టున్నాయి. కాస్త జాగ్రత్తగా ఉండండి.' అని అన్నాడు.

అప్పుడు భారతికి అర్థమయ్యింది తన భర్త ఎందుకు చెత్త వేయొద్దని మొదటిసారే చెప్పమన్నప్పుడు చెపితే ఇంటి పక్కన ఖాళీ స్థలం చెత్తకుండీ కాకుండా వుండేది. జరగాల్సిన నష్టం జరిగిపోయింది కానీ ఈ నష్టం ఎవరికి జరగొద్దు అని మనసులో అనుకుంది.

హాస్పిటల్ నుండి ఇంటికి చేరిన భారతి మొదట చేసిన పని వాళ్ళ ఇంట్లో వున్న ప్రగతితో పాటు ఆ కాలనీ వాళ్ళందరినీ పిలిచి మన చుట్టుపక్కల చెత్త వుంటే మనకు జరిగే నష్టం గురించి సజీవ సాక్ష్యంగా వాళ్ళ ఇంట్లో వారిని చూపించి అందరూ కలిసి ఆ చెత్త కుండిలోని చెత్తను చెత్తబండిలో వేసి ఆ ఖాళీ స్థలాన్ని ఖాళీగా వుంచకుండా రకరకాల పూల మొక్కలు, తులసి మొక్కలతో ఒక నందన వనంగా మార్చారు. దానిని కూడా మొదట చెత్త కుండికి ప్రారంభోత్సవం చేసిన రఘుతో ప్రారంభింపచేశారు. ఆ రోజు నుండి ఆ కాలనీలో వాళ్ళందరు ఆనందంగా వున్నారు.

– అనిశెట్టి సతీష్‌కుమార్
m : 72072 76494


# హైదరాబాద్‌లో పఠన సంస్కృతికి పునరుజ్జీవం




ఒకప్పుడు హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో నిశ్శబ్దమైన, నిరాడంబరమైన లైబ్రరీలు విస్తృతంగా ఉండేవి. 2000ల మధ్యకాలం వరకు ఈ గ్రంథాలయాలు అందరికీ అందుబాటులో ఉండి, ఎంతో మందిలో పఠన అలవాటును పెంచాయి. అయితే డిజిటల్ యుగం ప్రభావంతో అనేక లైబ్రరీలు మూసివేయబడ్డాయి లేదా ప్రాధాన్యత కోల్పోయాయి. క్రమంగా లైబ్రరీలు గతానికి చెందినవిగా మారాయి.

ఈ పరిస్థితుల్లో, కొంతమంది వ్యక్తులు మరియు సంస్థలు పఠనాన్ని తిరిగి ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చారు. వ్యక్తిగత అనుభవాల నుంచి పుట్టిన జ్ఞాపకాలు, ఏకాగ్రతతో చదవాలనే ఆసక్తి నగరం నలుమూలలా కొత్త గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రేరణగా మారుతున్నాయి. వాటిలో ముఖ్యమైనది కొండాపూర్ సమీపంలోని కొత్తగూడ జంక్షన్‌లో ప్రారంభమైన కోఫోర్జ్ పబ్లిక్ లైబ్రరీ. 15,660 చదరపు అడుగుల విస్తీర్ణంలో 15,000కు పైగా పుస్తకాలతో ఉచిత ప్రజా సంస్థగా సేవలందిస్తోంది. అదేవిధంగా, మణికొండలో మల్లికా పతి, దివ్య పతి చిన్న స్వతంత్ర లైబ్రరీలు పొరుగు స్థాయిలో పఠన అలవాట్లను పునరుజ్జీవింపజేస్తున్నాయి. ప్రజా గ్రంథాలయాలు హైదరాబాద్‌లో పఠన సంస్కృతికి కొత్త ఊపునిస్తున్నాయి.











## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# కొండాపూర్


తెలంగాణాలో కొండాపూర్ మరో బౌద్ధ చారిత్రక ప్రదేశము. ఈ గ్రామం హైదరాబాద్ నుండి జహీరాబాద్ జాతీయ రహదారి నం. 65ను (ఒకప్పటి ఎన్.హెచ్. నెం. 9) ఆనుకొని ఉన్న పెద్దాపూర్ గ్రామానికి 8 కి.మీ. దూరంలో, హైదరాబాద్ నుండి 70 కి.మీ. సంగారెడ్డి జిల్లా కేంద్రం నుండి 15 కి.మీ. కొండాపూర్ మండల కేంద్రంలో ఉంది. రెండు వేల ఎండ్ల కిందట రోమ్ సామ్రాజ్యంతో వర్తకం జరిగిన ఈ ప్రదేశం చుట్టూ మట్టి గోడలున్న నగరం కాబట్టి, గ్రీకు రాయబారి మెగస్తనీస్ ఇండికాలో పేర్కొన్న శాతవాహనుల 30 కోట గోడల నగరాల్లో ఒకటిగా వెలుగొందింది. ఒక ప్రాచీన నగరం కొండాపూర్ గ్రామ మట్టి దిబ్బల కింద శాతవాహన కాలపు వైభవం దాగి ఉందని 1900 సం॥లో హెన్రీ కౌసెన్స్ అనే బ్రిటీష్ ఆర్కియాలజిస్టు ఇక్కడ మధ్యరాతి యుగం, క్రొత్త రాతి యుగం ఆనవాళ్ళు కూడా ఇక్కడ లభించాయని 'లిస్ట్ ఆఫ్ ఆంటిక్వేరియన్ రిమైన్స్ ఇన్ హిజ్ హైనెస్ ది నిజామ్స్ టెరిటరీస్" అనే రిపోర్ట్‌లో పేర్కొనడంతో కొండాపూర్ చారిత్రక విశిష్టత ప్రపంచానికి తెలిసింది. దీని ప్రాధాన్యతను గుర్తించిన అప్పటి నిజాం ప్రభుత్వ పురావస్తు శాఖ 1937లో ఖ్వాజా మహమ్మద్ అహ్మద్ నేతృత్వంలో పరిశోధనలు జరిపింది. 1940 - 42 మధ్యకాలంలో జరిపిన త్రవ్వకాల్లో 19 అడుగుల వ్యాసంతో ఒక ఇటుక రాతి బౌద్ధస్థూపం, నగర వీధులు, రాజగృహ సముదాయం. బావులు, వృత్తి పని వారి కర్మాగారాల్లాంటి నిర్మాణాలు, కొలుములు, 15 అడుగుల వ్యాసంతో మరో బౌద్ధ స్థూపం, చైత్యం, విహారపు గదుల ఆనవాళ్ళు బయల్పడినవి. ఇంకా పెద్ద పెద్ద కుండలపై క్రీ.శ. 1వ శతాబ్దం నాటి బ్రాహ్మీలిపి అక్షరాలున్నాయి. బుద్ధపాదాలు, కుండపై త్రిరత్న ముద్రలవంటి ఆధారాలు ఇక్కడ బౌద్ధమత ప్రాధాన్యాన్ని తెలియజేశాయి. ఇక్కడ నాణేలు, నాణేలను పోతపోసే మూసలు, అచ్చులు, మట్టిబొమ్మలు (టెర్రకోట) గుఱ్ఱం, ఏనుగు వంటి జంతువుల బొమ్మలు, మానవ ఆకృతి బొమ్మలు, ఎరువు, నలుపు - ఎరువు, నగీషులు గల చిన్న పెద్ద మట్టి పాత్రలు ఇక్కడ లభించాయి.

ఇక్కడ ప్రత్యేకంగా నాణేలు వాటిని పోతపోసే అచ్చులను, మూసలు పరిశీలించిన ఖ్వాజా మహమ్మద్ అహ్మద్ కొండాపూర్ ఖచ్చితంగా నాణేలను ముద్రించిన శాతవాహన టంకశాల అయి వుంటుందని అభిప్రాయపడ్డారు. ఇక్కడ క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు గల 50 రాగి నాణేలు, 12 వెండి నాణేలు, 1835 సీసపు నాణేలు, రోమన్ చక్రవర్తి ఆగస్టస్ (క్రీ.పూ. 37 - క్రీ.శ. 14 సం.) విడుదల చేసిన బంగారు నాణెం దొరకడం, శాతవాహన ముందరి కాలానికి చెందిన నొక్కుడు గుర్తు గల (Punch Marked Coins) నాణేలు కొండాపూర్‌తో రోమ్ నగరానికి నాడు ఉన్న వాణిజ్య సంబంధాలను తెలుపుతుంది. ఇక్కడి మట్టి బొమ్మల్లో యక్ష నగ్నదేవత, సుద్దతో చేసిన హారీతి (తల్లీబిడ్డల) బొమ్మ, మట్టిపూసలు, విలువైన రాళ్ళతో చేసిన పూసలు, రాగి చెవి కమ్మలు, దంతపు దువ్వెన, గాజులు, కంఠాభరణములు లభించాయి. అటు అరేబియా సముద్రానికి ఇటు బంగాళాఖాతానికి జలమార్గం ద్వారా కొనసాగిన వాణిజ్యంలో కొండాపూర్ భాగమైంది. ఒక వైపు మంజీరా, మరోవైపు మూసీనది అక్కడి నుండి కృష్ణానదిలో ప్రవేశించి మచిలీపట్నం వరకు కొంత వరకు రోడ్డు మార్గం. జలరవాణా రోమ్ వర్తక వాణిజ్యానికి శాతవాహన నగరాల్లో మనకు లభించిన రోమన్ నాణేలు సాక్ష్యాలనిస్తున్నాయి. అంతేకాకుండా కథా సాహిత్యంలో తొలి రచన బృహత్కథను గుణాఢ్యుడు కొండాపూర్ ప్రాంతంలోనే రాసాడని, శాతవాహన చక్రవర్తి హాలుడు ఇక్కడి నుంచే పాలించాడని చరిత్రకారుల అభిప్రాయం. 2009-2011 మధ్య కేంద్ర పురావస్తు శాఖ (ASI) మరో మారు తవ్వకాలు చేశారు. కొండాపూర్ స్థల ప్రదర్శన శాలలో ఇక్కడ దొరికిన చారిత్రక వస్తువులను కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శనకుంచారు. మరికొన్ని వస్తువులను పబ్లిక్ గార్డెన్ రాష్ట్ర పురావస్తు మ్యూజియంలోనూ ప్రదర్శనలో ఉంచారు. ఇక్కడ సుమారు 100 ఎకరాల స్థలం రక్షిత ప్రదేశంలో కేవలం 5 ఎకరాలు మాత్రమే త్రవ్వకాలు జరిపి మళ్ళీ కప్పి ఉంచారు. ఇక్కడ పూర్తి స్థాయిలో కేంద్ర పురావస్తు శాఖ త్రవ్వకాలు జరిపి ఒక మహంజొదారో, హరప్పా నగరాల నరసన కొండాపూర్ శాతవాహన నగరాన్ని పునర్జీవింపజేయగలిగితే, సందర్శకులకు అన్ని వసతులు కల్పించి నట్లయితే, గొప్ప చారిత్రక నగరాన్ని భావితరాలకు అందించి నిజమైన చరిత్రకు మనం వారసులం కాగలుగుతాం!

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

సైన్సు

# నన్ను ముట్టుకోకోయ్




ప్రాణం లేని ఒక వస్తువు నిర్జీవమైన మరో వస్తువును రవ్వంత తాకితే చాలు తన సొమ్ము అంతా కొల్లబోయినట్లు "నన్ను ముట్టుకోకోయ్!" అని గంయిమని అరుస్తుంది. అటువంటి ఉలిపికట్టె నోరు నొక్కాలంటే దానిని తాకకుండా తప్పుకుపోవడం తప్ప గత్యంతరం లేదు. పోనీ దాని జోలి మనకెందుకులే అని దూరంగా పోరాదా అంటే – పోవడానికి లేకుండా ఆ రెండు వస్తువులూ ఒక దానితో ఒకటి లంకె పడి ఉన్నాయి. ఒకదానినొకటి తాకకుండా ఈ విచిత్రమైన గందరగోళం నుంచి బయట పడగలరేమో ప్రయత్నించడం పిల్లలకే కాదు పెద్దలకి కూడా ఆనందదాయకంగానే ఉంటుంది. ఈ గమత్తు తయారు చేయడానికి రెండు గజాల పొడుగున్న రాగి తీగ, ఆరు వోల్టు బేటరితో పని చేసే ఎలక్ట్రిక్ బెల్, మూడు వోల్టుల టార్చిలైటు బల్బు, స్విచ్చి, తొమ్మిది వోల్టుల బేటరీ, తాళం చెవి, వగైరా కావాలి.

బల్ల మీద సుమారు గజం ఎడంలో రెండు చిల్లులు పొడిచి, అందులో ఆరేసి అంగుళాల పొడవు ఉన్న రెండు ఊచలు నిట్టనిలువుగా బిగించాలి. ఈ ఊచల మధ్య రాగి తీగను బిగించి కట్టాలి. అదే తీగను బొమ్మలో చూపినట్లు బెల్, లైట్, స్విచ్చి, బేటరీ, తాళం చెవి – ఈ వరసలో కలపాలి. ఊచల మధ్య బిగించిన రాగి తీగను తాళం చెవి రంధ్రంలో నుంచి పోనివ్వాలి.

స్విచ్చి వెయ్యి. తాళం చెవి ఆ తీగకు తగలకుండా "క" నుంచి "గ" వరకూ నడిపించాలి. మధ్యలో తాళం చెవి తీగకు తగిలితే ఓడిపోయినట్లు. తీగకు తగిలినదీ లేనిదీ బెల్లూ, లైటూ అబద్ధం ఆడకుండా చెబుతాయి. మీ స్నేహితులను ఒక్కరొక్కరినే ఈ ఆట ఆడమని చెప్పు. ఎవరి చెయ్యి వణకకుండా తొట్రుపాటు లేకుండా చెప్పినట్లు, నడుస్తుందో దీనిని బట్టి తెలిసిపోతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్


'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

## సామెతలు

- అన్నం అరఘడియలో అరుగుతుంది. ఆదరణ శాశ్వతంగా ఉంటుంది.
- ఆరంభశూరుడికి ఆర్భాటమెక్కువ.
- ఇంటి దీపమని ముద్దు పెట్టుకుంటే మీసాలన్నీ తెగ కాలాయట.
- ఈనాడు ఇంటిలో, రేపు మట్టిలో.
- ఉన్నదే మనిషికి పుష్టి, తిన్నదే పసరానికి పుష్టి.
- ఊరంతా చుట్టాలు. ఉట్టి కట్టుకోను చోటు లేదు.
- ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు.
- ఎవరి పిచ్చివారికానందం.
- ఏ కర్రన నిప్పుంటే ఆ కర్రే కాలుతుంది.

– బాలచెలిమి

లఘు నాటిక



# పళ్ళు పుచ్చిపోతాయి...

**పాత్రలు: స్వామీజీ (రామకృష్ణ),**
**కూతురు (సౌజన్య), తల్లి (పావని),**
**తండ్రి (అవినాష్), కొడుకు (సంకేత్)**

## దృశ్యం - 1

సంకేత్: (బ్యాగు తీస్తూ ఇంట్లోకి వస్తు) అమ్మా పన్ను నొప్పి... అమ్మా నొప్పి... అబ్బా నొప్పెస్తుందమ్మా!

పావని: సంకేత్ ఏమైందిరా ఎందుకలా విలవిల్లాడు తున్నావ్?

సౌజన్య: (తను కూడా బ్యాగు విప్పుతూ) ఇంకేముందమ్మా తమ్ముడు సంగతి తెలియదా "పన్ను నొప్పట పన్ను నొప్పి" (స్టైల్ చేసి పలుకుతుంది)

పావని: వాడలా అంతగా బాధపడుతుంటే నువ్వేంటి అలా వంకరగా అంటున్నావ్?

సౌజన్య: మరి లేకపోతే ఏమిటమ్మా? నువ్వు రోజు చెప్తావుగా చాక్లెట్స్ తినొద్దు స్వీట్స్ తినొద్దు తింటే పళ్ళు పుచ్చిపోతాయి అని.... విన్నాడా? చూడు ఈ రోజు స్కూల్లో ఎన్ని చాక్లెట్లు తిన్నాడో అడుగు...

పావని: ఏరా అక్క చెప్పింది నిజమేనా ఎన్ని తిన్నావు? నిన్నే అడుగుతున్నా కదా? చెప్పు (అని గద్దిస్తుంది)

సంకేత్: అమ్మా... అది... అది

సౌజన్య: నాయనా సంకేతు నిజం చెప్పు నాయనా చెప్పు చెప్పు? అమ్మ అడుగుతుందిగా చెప్పు (నవ్వుతూ అంటుంది)

అవినాష్: ఏం జరిగింది అందరూ అలా ఉన్నారు?

సౌజన్య: నాన్న ఏం లేదు మరి తమ్ముడికీ... (చెప్పనా చెప్పనా అని సైగ చేస్తుంది వద్దు వద్దు అంటుంటాడు సంకేత్)

అవినాష్: ఏమైందని అడిగితే అదీ అదీ అని ఆపేస్తావేంటి?

సౌజన్య: ఏం లేదు నాన్న ఓ లెక్క చెప్తా వినండి సంకేత్ స్కూల్‌కి వెళ్తూ ఒక చాక్లెట్ తీసుకెళ్లాడు. దారిలో తిన్నాడు. క్లాస్‌లోకి వెళ్ళగానే వాడి బెస్ట్ ఫ్రెండ్ సౌరవ్ పుట్టిన రోజు వాడు బెస్ట్ ఫ్రెండ్ కదా

అని ఇంకో రెండు చాక్లెట్లు ఎక్కువ ఇచ్చాడు అదే రోజు అమ్మాయి సమీర బర్త్ డే కూడా. ఆ అమ్మాయి కూడా రెండు చాక్లెట్లు ఇచ్చింది మొత్తం ఎన్ని చాక్లెట్లు తిన్నాడు అంటారు?

పావని: అదేనండి స్కూల్ నుంచి రాగానే పన్ను నొప్పి పన్ను నొప్పి అని ఒకటే ఇబ్బంది పడుతున్నాడు

అవినాష్: వాడు ఇబ్బంది పడతాడు నువ్వు అల్లాడి పోతావు ఇది మామూలేగా

పావని: నిజంగానే నొప్పి అంటున్నాడు కదండీ

అవినాష్: ఇలా ఎన్నిసార్లు పన్ను నొప్పి అన్నాడు చూస్తూనే ఉన్నాం కదా అరేయ్ సంకేత్ చెప్పరా నీకు ఎన్నిసార్లు ఇలా పన్ను నొప్పి వచ్చింది?

సంకేత్: ఒక్కొక్క వేలు తెరుస్తూ ఉంటాడు ఒకటి రెండు మూడు కాదు కాదు కాదు నాలుగు

(సౌజన్య పావని ఫక్కున నవ్వుతారు)

సంకేత్: అదేంటి నాకు పన్ను నొప్పి వస్తే మీరు నవ్వుతున్నారు ఏంటి అమ్మా చూడు..నిజంగానే నొప్పి అక్కా చూడవే

పావని: సరే సరే వెళ్లి ముందు కాళ్లు చేతులు కడుక్కొని బ్రష్ చేసుకుని నోరు బాగా చక్కగా పుక్కిలించి ఇక్కడికి రా తిన్నాక మందు వేస్తా.

(సంకేత్ లోపలికి వెళ్ళాడు)

పావని: వీడిచేత ఈ చాక్లెట్లు స్వీట్లు తినడం ఎలా మాన్పించాలో అర్థం కావడం లేదండి

అవినాష్: (ఆలోచిస్తూ తిరుగుతుంటాడు)

సౌజన్య: మా టీచర్స్ కూడా చెబుతుంటారు నాన్న పళ్ళు ఉదయం లేవగానే బ్రష్ చేసుకుని నీళ్లతో పుక్కిలించాలి. రాత్రి పడుకో పడుకునే ముందు బ్రష్ చేసుకోవాలి... పళ్ళని జాగ్రత్తగా చూసుకోవాలి అని... అయినా వీడు చాక్లెట్లు చూస్తే చాలు ఆపుకోలేడు తినేస్తూనే ఉంటాడు.

అవినాష్: ఐడియా! మనం భోంచేసాక స్కిట్ టైంలో నేను చెప్పిన స్కిట్ వేద్దాం బాబాయి రాగానే బాబాయిని కూడా ఓ పాత్ర వేయిస్తాం

సౌజన్య: ఏం చేయాలి?

(సౌజన్య, పావని దగ్గరకు వస్తారు. అవినాష్ చెబుతుంటారు)

## దృశ్యం - 2

(స్వామిజీగా బాబాయి ఒక ఆసనం మీద కూర్చొని ఉంటాడు. అతని ముందు పళ్ళాలలో (plates) స్వీట్లు, పక్కన చాక్లెట్లు, పండ్లు ఉంటాయి.)

(అవినాష్ మైక్ దగ్గర ఉండి అనౌన్స్‌మెంట్ చేస్తుంటాడు)

అవినాష్: మిత్రులారా మనమిప్పుడు రామకృష్ణ మఠం లో ఉన్నాం స్వామి దగ్గరికి వచ్చి మీరు మీ సమస్యలను విన్నవించుకుంటే మీకు తగిన ఉపాయం చెప్తారు కావలసిన సూచనలు సలహాలు అందజేస్తారు.

పావని: (కొంగు భుజం నిండుగా వేసుకొని తల వంచుకొని ఉంటుంది) నమస్కారం స్వామి (పక్కన కొడుకు సంకేత్‌ను తీసుకు వస్తుంది.) చెప్పు స్వామికి

సంకేత్: నమస్కారం స్వామి

సౌజన్య: నమస్కారం స్వామి

రామకృష్ణ: (కళ్ళు తెరిచి) నమస్కారం చెప్పండమ్మా!

సౌజన్య: స్వామీజీ ఈవిడ మా అమ్మ ఇతను మా తమ్ముడు. మా తమ్ముడికి స్వీట్స్ అంటే చాలా ఇష్టం. చాక్లెట్లు మిఠాయిలు ఎంత వద్దని చెప్పినా అదే పనిగా తింటున్నాడు.

పావని: స్వామీజీ మీరే కొంచెం మందలించి చెప్పండి

(సంకేత్‌ని చూసి స్వామీజీ ఒక చిరునవ్వు నవ్వుతాడు)

(అందరూ నిశ్శబ్దంగా నిలబడ్డారు కాసేపయ్యాక)

రామకృష్ణ: (కళ్ళు తెరిచి) అమ్మా మీరంతా వచ్చేవారం రండి.

(అందరూ వెళ్ళిపోతారు) (అవినాష్ తిరిగి వస్తాడు)

అవినాష్: (అనౌన్స్ చేస్తాడు) మరుసటి వారం (అందరూ తిరిగి వస్తారు)

సౌజన్య: నమస్కారం స్వామీజీ

సంకేత్: నమస్కారం స్వామి

పావని: నమస్కారం స్వామీజీ

రామకృష్ణ: నమస్కారం చెప్పండమ్మా!

పావని: అదే స్వామి పోయిన వారం వచ్చాము. మా అబ్బాయి స్వీట్లు, చాక్లెట్లు తినడం మానలేదు. మీరు చెప్తారని...

సౌజన్య: అవును స్వామి మీరు తిరిగి వచ్చేవారం రమ్మన్నారు

రామకృష్ణ: ఆ అవునమ్మా జ్ఞప్తికి వచ్చింది. (తన ముందు ఉన్న పళ్ళాల వైపు చూస్తాడు) (అందరూ నిశ్శబ్దంగా ఉంటారు)

రామకృష్ణ: (కాసేపటికి కళ్ళు తెరిచి) మీరు తిరిగి వచ్చేవారం రండి (అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు నెమ్మదిగా వెళ్ళిపోతారు.)

(అవినాష్ తిరిగి వస్తాడు.)

అవినాష్: (మైక్ ముందు) మరుసటి వారం (స్వామీజీ ధ్యానంలో ఉంటారు)

పావని: నమస్కారం స్వామీజీ

సౌజన్య: నమస్కారం స్వామి

రామకృష్ణ: (కళ్ళు తెరిచి తన ముందున్న పళ్ళాలలో చూస్తాడు వీరి వైపు తిరిగి) నమస్కారం!

సౌజన్య: స్వామి మేము గత రెండు వారాలుగా మీ దగ్గరికి వస్తున్నాము. మా తమ్ముడికి స్వీట్లు తినే అలవాటు మాన్పించాలని మీరు తిరిగి ఈరోజు రమ్మన్నారు.

పావని: స్వామి మీరు ఏమీ చెప్పలేదు మా వల్ల ఏమన్నా పొరపాటు జరిగిందా?

రామకృష్ణ: (చిరునవ్వుతో) లేదు తల్లీ! పొరపాటు నా వల్లే జరిగింది.

పావని: అదేంటి స్వామి మీరు పొరపాటు చేయడమేంటి?

రామకృష్ణ: చెబుతాను నాయనా అబ్బాయి పేరేమిటి?

సౌజన్య: సంకేత్ స్వామి

రామకృష్ణ: సంకేత్ ఇలా రా నాయనా

(సంకేత్ రామకృష్ణ స్వామి ముందు మోకాలి మీద కూర్చుంటాడు)

రామకృష్ణ: చూడు సంకేత్ ఈ పళ్ళాలలో ఉన్న తీపి పదార్థాలన్నీ ఎంతగా మనల్ని ఊరిస్తున్నాయో... అలాగని అవన్నీ తినేస్తే మన ఆరోగ్యమే పాడవుతుంది. నీకు చాక్లెట్లు ఇష్టమే కానీ పళ్ళు పుచ్చిపోతాయి తిరిగి రావు కదా ఒక్కసారిగా తినడం మానవద్దు క్రమంగా తినే సంఖ్య తగ్గిస్తూ నీ అలవాటు మార్చుకో సరేనా.

సంకేత్: సరే స్వామి మెల్లిగా తగ్గిస్తాను.

సౌజన్య: స్వామి నేను ఒకటి అడగనా చిన్న సందేహం!

రామకృష్ణ: (నవ్వుతూ) అడుగు తల్లీ!

సౌజన్య: మీరు ఇదే విషయము మొదటి వారం మేము రాగానే ఎందుకు చెప్పలేదు?

రామకృష్ణ: మంచి ప్రశ్న మీరు వచ్చినప్పుడు నాకు కూడా తీపి పదార్థాలు అంటే ఇష్టం తినకుండా ఉండలేకపోయాను.

సంకేత్: అవునా స్వామి మీకు కూడా నాకులాగా స్వీట్స్ ఇష్టమా?

రామకృష్ణ: (నవ్వు ముఖంతో) అవును నాయనా కానీ నిన్ను తినొద్దు అని చెప్పాలంటే నేను తినకుండా ముందు అలవాటు చేసుకోవాలి. అంటే మనమేం చెబుతాము అది ఆచరించాలి. ఆచరణ చేయకుండా సూచనలు సలహాలు చేయకూడదు.

పావని: ఎంత మంచి మాట!

రామకృష్ణ: అవునమ్మా నేను రెండు వారాలుగా నా కళ్ళ ముందు ఎన్ని తీపి పదార్థాలు కనిపించిన తినకుండా ఉండడం అలవాటు చేసుకున్నాను. ఇప్పుడు మీ అబ్బాయికి కూడా చెప్తున్నాను మెల్లిగా ఈ అలవాటు తగ్గించుకోమని సంకేత్ ఇకపై స్వీట్లు చాక్లెట్లు, క్రమంగా తినడం తగ్గిస్తావు కదా!

సంకేత్: అలాగే స్వామి.

అవినాష్: చూశారా రామకృష్ణ పరమహంస ఎంత మంచి సూచన చేశారు. స్వీట్లు తినకూడదు ఆ విషయం ఎదుటివారికి చెప్పాలంటే ముందు మనం ఆచరించాలి. అర్థమైంది కదా!

పావని, సంకేత్, సౌజన్య: అర్థమైంది నాన్నా!

అవినాష్: చాక్లెట్లు స్వీట్లు తింటే ఏమవుతుంది?

అందరు: పళ్ళు పుచ్చిపోతాయి

(అందరూ నవ్వుతారు. స్వామీజీ పాత్ర వేసిన బాబాయిని మెచ్చుకుంటారు. ఒకే వరుసలో నిలబడి నమస్కరిస్తారు)

– డా. సమ్మెట విజయ

m: 99898 20215

# ఆ అద్భుతమైన శాస్త్రవేత్తలిద్దరు అపూర్వమైన మిత్రులు!

కోల్‌కతా నగరంలో సాహా ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్, ఎస్.ఎన్. బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ అనే ప్రఖ్యాత పరిశోధన కేంద్రాలు ఉన్నాయి. మొదటిది మేఘనాథ సాహా బతికి ఉన్నప్పుడే ఆయనే 1943లో ప్రారంభించిన సంస్థ సాహా ఇన్‌స్టిట్యూట్, అయితే అప్పట్లో ఆ సంస్థలో ఆయన పేరు ఉండేది కాదు. కాగా రెండవది సత్యేంద్రనాథ్ బోస్ గతించిన తర్వాత 1986లో మొదలైనది. ఈ ఇద్దరు ప్రఖ్యాత శాస్త్రవేత్తలు అని చెప్పడం ఎందుకంటే మేఘనాథ సాహా పరిశోధన 'సాహా అయనైజేషన్ ఈక్వేషన్' (Saha Ionisation Equation) చాలా ప్రఖ్యాతమైనది. బోస్ పేరున అయితే 'బోస్-ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్ (Bose-Einsteine Statistics)', 'బోసాన్స్ (Bosons)', 'బోస్ -ఐన్‌స్టీన్ కండెన్సేట్ (Bose-Einsteine condensate)' మొదలైన ఆవిష్కరణలు చాలా ప్రసిద్ధమైనవి. ఈ ఇద్దరూ 1920 దశకంలోనే అమోఘ ప్రతిభ చూపి తమ పరిశోధనలను ప్రపంచానికి చవి చూపించిన వారు.



మేఘనాథ్ సాహా 1893 అక్టోబర్ 6న ఢాకా దగ్గర గ్రామంలో జన్మించగా, సత్యేంద్రనాథ్ బోస్ 1894 జనవరి 1న కలకత్తాలో పుట్టారు. అంటే వీళ్లిద్దరి మధ్య వయసు అంతరం మూడు నెలలు కూడా లేదు. వీరిద్దరూ కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో 1913లో బి.ఎస్సి., 1915లో ఎం.ఎస్సి. చదివారు. ఈ రెండు పరీక్షలలోను బోస్ ప్రథముడిగా, సాహా రెండో స్థానంలో నెగ్గారు. ఈ ఇద్దరు ప్రఖ్యాత శాస్త్రవేత్తలు పి.సి.రే, జగదీశ్ చంద్రబోస్ మొదలైన వారి దగ్గర కలిసి చదువుకొని స్ఫూర్తి పొందిన వారు. మేఘనాథ్ సాహా లోక్ సభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలవగా, ఎస్.ఎన్. బోస్ రాజకీయ పార్టీల ఒత్తిడి కారణంగా రాజ్యసభ సభ్యుడయ్యాడు. యువకుడిగా సాహా ఢాకా ప్రాంతంలో స్వదేశీ ఉద్యమంలో పాల్గొని అక్కడి నుంచి బహిష్కరించబడి కలకత్తా విద్యాసంస్థలలో చేరిన వాడు. కానీ సత్యేంద్రనాథ్ బోస్ ఢాకా విశ్వవిద్యాలయంలో రెండు దశాబ్దాలకు మించి పనిచేసి, దేశ విభజన కారణంగా 1947లో కలకత్తా తిరిగి వచ్చిన వ్యక్తి. ఇరువురికి ఏడుగురు చొప్పున సంతానం కలగడం కూడా విశేషం. మేఘనాథ్ సాహా సుమారు 63 ఏళ్లు జీవించి 1956 ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవనం వెళుతూ ప్రయాణం మధ్యలో గుండెపోటుతో కనుమూశారు. బోస్ 80 ఏళ్లు నిండు జీవితం గడిపి గతించారు. ఇద్దరి పేర్లు నోబెల్ బహుమతికి నామినేషన్ కావడం, అయితే ఆ బహుమతి ఇద్దరికీ రాకపోవడం కూడా ఉంది.

సాహా తండ్రి చాలా పేదవాడు ఓ అంగట్లో పని చేసేవాడు. నిమ్న కులాల వ్యక్తి కావడంతో కలకత్తాలో చదివే కాలంలో తమ భోజనశాలలో రావద్దని తోటి విద్యార్థులు వివక్ష చూపడం సాహా జీవితంలో కనబడుతుంది. అలహాబాద్ యూనివర్సిటీలో ఒకటిన్నర దశాబ్దం పని చేసి మేఘనాథ సాహా కలకత్తా విశ్వవిద్యాలయానికి తరలి వచ్చిన వ్యక్తి. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ వంటి సైన్సు సంస్థలతో చాలా చురుకుగా ఉన్న శాస్త్రవేత్త కూడా మేఘనాథ్ సాహా. 1935లో సాహా 'సైన్స్ అండ్ కల్చర్' పేరున ఒక మాస పత్రికను చివరి వరకు నిర్వహించడం విశేషం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గమనించిన విషయం ఏంటంటే దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన కాలమానం అంటే క్యాలెండర్ వాడటం గమనించారు. ఒకే దేశంగా ఉన్నప్పుడు ఇది కొంత అయోమయానికి దారితీస్తుందని 'ఇండియన్ స్టాండర్డ్ టైమ్' లాగానే దేశవ్యాప్తంగా ప్రజలందరూ వినియోగించు కునేందుకు ఒక క్యాలెండర్ అవసరమైంది. ఇప్పుడు భారత ప్రభుత్వం అనుసరించే శకసంవత్సర విధానం మేఘనాథ్ సాహా కమిటీ రూపొందించినదే. పార్లమెంటు సభ్యుడిగా కూడా నీటి నిల్వ చేయడం, వ్యవసాయం, ప్రాజెక్టులు వంటి వాటి మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టారు. దామోదర్ వ్యాలీ నిర్మాణం కావడం ఆయనకు విలువైన నివాళి వంటిదే.

సత్యేంద్రనాథ్ ఐన్‌స్టీన్ వంటి మహా శాస్త్రవేత్తను అబ్బురపరిచిన ప్రతిభావంతుడు. పీహెచ్డీ లేదని ఢాకా విశ్వవిద్యాలయంలో ఆయనకు ప్రొఫెసర్ పోస్టు ఇవ్వలేదు, చివరికి ఐన్‌స్టీన్ జోక్యం కారణంగా ఆ పదవి లభించింది. ఇష్టం లేని పని ఆయన పెద్దగా చేసేవారు కాదు. అలాగే లెక్కకు మించిన పరిశోధన పత్రాలు రాయడం కూడా ఆయన విధానం కాదు 1924-34 మధ్య ఆయన ప్రచురించిన ఒక పరిశోధన పత్రం కూడా లేకపోవడం గమనార్హం. బెంగాలీ ఇంగ్లీష్ ఫ్రెంచ్ జర్మన్ హెబ్రూ వంటి భాషలే కాదు; గణితశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఖనిజశాస్త్రం, తత్వశాస్త్రం, సంగీత శాస్త్రం, లలిత కళలు, సాహిత్యం ఇలా చాలా రంగాలలో ఆయనకు ప్రవేశం ఉంది. వేణువుతోపాటు ఎజ్రా అనే సంగీత వాయిద్యాన్ని కూడా వాయించేవారు. మంచి భోజనం, మంచి దుస్తులు అంటే అమితంగా ఇష్టపడే సత్యేంద్రనాథ్ బోస్ స్నేహితులన్నా, హాస్య చతురత అన్నా చాలా ఇష్టంగా ఉండేవారు. ఈయన కృషి ఆధారంగా ఎంతో పరిశోధన జరిగింది. మరి ముఖ్యంగా ఓల్డ్ క్వాంటం మెకానిక్స్‌కు, న్యూ క్వాంటం మెకానిక్స్‌కు దారులు వేసిన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలలో సత్యేంద్రనాథ్ బోస్ కూడా ఒకరు. ఈ అద్భుతమైన శాస్త్రవేత్తలిద్దరు అపూర్వమైన మిత్రులు, అదే సమయంలో ఇద్దరి మధ్య ఎన్నో పోలికలు మరెన్నో తారతమ్యాలు!!

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392

# రావి చెట్టు



విద్యార్థులారా... మనం ప్రతి నెల బాల చెలిమి సంచికలో ఏదో ఒక చెట్టు గురించి తెలుసుకుంటున్నాం కదా! చెట్లు మనకు అమ్మ లాంటివి. కమ్మని జీవితాన్ని ప్రసాదిస్తాయి. అందుకే చెట్లను ప్రేమిద్దాం. చెట్ల గురించి తెలుసుకుందాం. ఈ ఫిబ్రవరి సంచికలో రావి చెట్టు గురించి తెలుసుకుందామా బాలలూ!

రావి చెట్టు విశాలమైన పెద్దగా పెరిగే చెట్టు. దీన్ని ఆంగ్లంలో "పీపలు" అంటారు. అశ్వత్థ వృక్షం అని కూడా పిలుస్తారు. దీన్ని వృక్ష శాస్త్రంలో 'ఫైకస్ రిలీజియోసా' అని అంటారు. "మోరాసెయే" కుటుంబానికి చెందినది. భారతదేశ సంస్కృతిలో లోతుగా ఈ చెట్టు పాదుకుని ఉంది. మన భారతదేశంతో పాటు చైనా, నేపాల్ వంటి దేశాలలో ఈ చెట్లు అధికంగా పెరుగుతాయి. హిందువులతో పాటు బౌద్ధులకు, జైనులకు ఇది పవిత్ర వృక్షం. ఈ చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనిని త్రిమూర్తుల స్వరూపంగా భావించి పూజిస్తారు. పరమ పవిత్రమైనదిగా రావి చెట్టు పేరుగాంచింది. రావి చెట్టును కొన్ని ప్రాంతాల్లో రాగి చెట్టు అని కూడా పిలుస్తారు. ఇది సుమారు 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. రావి చెట్టు జీవితకాలం సాధారణంగా 900 నుండి 1500 సంవత్సరాల వరకు ఉంటుంది. శ్రీలంకలోని "జయశ్రీ మహాబోధి" రావిచెట్టు మత ప్రాముఖ్యత కలిగిన అతి పురాతనమైన చారిత్రక చెట్టు అని చెప్పబడింది. దీని వయసు 2250 సంవత్సరాల కంటే ఎక్కువ అని, ఇది ప్రపంచంలోనే అతి పురాతనమైన చెట్టు అని చెప్పబడుతుంది. వినాయక చవితి రోజు ఈ చెట్టు ఆకులను పూజా కార్యక్రమంలో పెట్టి పూజిస్తారు. వినాయకునికి పెట్టే 21 ఆకులలో ఇది ఒకటి. కృష్ణ భగవానుడు తాను అశ్వత్థా వృక్షంగా చెప్పుకున్నట్టు భగవద్గీతలో చెప్పబడింది. యువరాజుగా ఉన్న సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడిగా మారింది ఈ రావి వృక్షం కిందనే. అందుకే దీన్ని "బోధివృక్షం" అని కూడా అంటారు. దేవాలయాలలో ఈ చెట్లు తరచుగా కనిపిస్థాయి. కొద్దికాలం క్రితం వరకు తెలంగాణ, ఆంధ్ర గ్రామీణ ప్రాంతాలలో ప్రతి బావి దగ్గర ఒక రాగి చెట్టు సహజంగా కనిపించేది. ఇప్పుడు ఎక్కడో ఒకచోట ముఖ్యంగా పట్టణాలలో ఈ చెట్టు పూజావృక్షంగా కనిపిస్తుంది. పద్మ పురాణం ద్వారా రాగి చెట్టును విష్ణు స్వరూపంగా భావిస్తారు. రాగి చెట్టును శ్రేష్ఠమైనదిగా దేవతా వృక్షంగా భావిస్తారు. ఈ చెట్టు ఆకులు హృదయం ఆకారంలో ఉంటాయి.


**రావి చెట్టు వల్ల కలిగే ప్రయోజనాలు**


- రావి చెట్టు బెరడుకు జలుబు, ఉబ్బసం వంటి వ్యాధులను న్యాయం చేసే శక్తి ఉంది.
- దీన్ని బెరడును నీటిలో వేసి మరిగించి పుక్కిలిస్తే నోటి పుండ్లు నయమవుతాయి.
- బాగా పెరిగిన రావి చెట్టు ఒక్కరోజులో పదిమందికి సరిపోను ఆక్సిజన్ ను ఉత్పత్తి చేయగలదు.
- రావి చెట్ల గాలి నుండి కాలుష్య కారకాలను గ్రహించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా సహాయ పడుతుంది.
- ఈ చెట్టు ఆకుల్ని నీటిలో మరిగించి తాగితే షుగర్ తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రావి ఆకులు యాంటీ బ్యాక్టీరియల్, ఆంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటాయి.
- ఈ చెట్టు ఆకుల కషాయం జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఈ ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. ఆకుల కషాయం తాగడం వల్ల చలికాలంలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- రావి ఆకులలో చక్కెరను నియంత్రించే గుణాలు ఉంటాయి. ఇన్సులిన్ పెరుగుతుంది.
- ఈ ఆకుల కషాయం మచ్చలు మొటిమలు, చర్మ వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.
- భారీగా పెరిగే రావిచెట్టు పక్షులకు నివాస ప్రాంతాలు గానే కాకుండా, రావి పండ్లు ఆహారంగా ఉపయోగపడతాయి.

రావి చెట్టు సతత హరిత వృక్షంగా పరిగణిస్తూ, మానవాళికి ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఆక్సిజన్ ను అందిస్తుంది. పక్షులకు, జంతువులకు ఆహారంగా, ఆవాసంగా ఉపయోగపడుతుంది. రావి చెట్టులో దేవతలు నివసిస్తారని ఒక నమ్మకం కూడా ఉంది. ఈ రావి చెట్టు రానురాను కనుమరుగవుతుంది. పర్యావరణ దృష్ట్యా పార్కులలో, వ్యవసాయ భూముల్లో, పాఠశాల ఆవరణలో మనం కూడా రావి చెట్టు పెంచుకుందాం. పచ్చని ప్రకృతిని కాపాడుకుందాం. సరేనా బాలలూ!

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

m : 9441561655


మన ఆలోచనలే
విన్న కథకి అక్షరీకరణ:
జుగాష్విలి
బొమ్మలు:
తాతయ్య : గోపీ! ఇలా రా! ఈ రోజు నీకొక కథ చెప్తాను.
గోపి : ఓ భళే... భలే... చెప్పు తాతయ్యా... నువ్వు కథలు చెప్పి చాలా రోజులైంది.
తాతయ్య : అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఒక కంపెనీ ఉంది. అందులో వంద మంది దాకా పని చేస్తున్నారు. ఒక రోజు ఉదయం వారంతా కంపెనీకి రాగానే ఒక నోటీస్ కనిపించింది.
గోపి : నోటీసా! ఏముంది అందులో?
తాతయ్య : మీ వృత్తిలో మీరు ఎదగకుండా అడ్డుకుంటున్న వ్యక్తి ఈ రోజు ఉదయం చనిపోయాడు. కాన్ఫరెన్స్ హాలులో శవం ఉంది. ఒక్కొక్కరుగా వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించండి అని వుంది.
అందరూ గుసగుసలాడుతున్నారు. మనం ఎదగకుండా అడ్డుకున్న అతడెవరు? అంత అవసరమేమొచ్చింది. సరే! అతడెవరో చూసొద్దాం పదండి.
అలా ఒక్కొక్కరు వెళ్ళి బయటికి వస్తున్నారు. వెళ్లేటప్పుడు విచారాన్ని నటిస్తూ వెళ్తున్నారు. వచ్చేటప్పుడు గంభీరమైన ముఖంతో వస్తున్నారు.


గోపి : లోపల ఏం జరిగింది తాతయ్య
తాతయ్య : అదిగో అటు చూడు. అతన్ని అందరూ కంప్లైట్స్ కామేశం అంటారు.
గోపి : అదేం పేరు తాతయ్యా.
తాతయ్య : అతడు అందరినీ అది చేయలేదు, ఇది చేయలేదు. ఇట్లా చేసాడు అట్లా చేసాడు అంటూ అందరి మీద కంప్లైట్స్ చేస్తూనే వుంటాడు ఎప్పుడూ - పేరుకు తగ్గవాడేలే.
తన అభివృద్ధిని అడ్డుకున్నది ఎవరు? తొందరగా చూడాలి అనుకుంటూ అతడు లోపలికి వెళ్లాడు.
శవం మీద ముసుగు తీసాడు. అక్కడెవరూ లేరు. అద్దం ఉంది. తన ముఖమే తనకు కన్పించింది. ఏమిటిది? ఈ కంపెనీ వాళ్ళు ఎందుకింత అవమానించారు. వీళ్ళమీద కేసు వేయాలి. ఈ అద్దాన్ని పగలగొట్టాలి అంటూ కోపంతో ఊగిపోయాడు. అప్పుడు బెడ్‌కి ఒక స్లిప్ అంటించి ఉంది. కోపం తెచ్చుకోవద్దు. అరచి గోల చేయకండి. ఆలోచించండి. మీ అభివృద్ధికి మీరే అడ్డు. ఇది అర్థం కావడానికే ఈ ప్రయత్నం. అతడూ గంభీరమైన ముఖంతో బయటికి పోయాడు.
గోపి : అదేమిటి తాతయ్య! తమ అభివృద్ధికి తామే ఎలా అడ్డు అవుతారు?
తాతయ్య : అవునురా గోపీ. ఎవరినైనా తమ ఆలోచనలే నడిపిస్తాయి. సానుకూల ఆలోచనలు అభివృద్ధికి మేలు చేస్తాయి. ప్రతికూల ఆలోచనలు మనిషి ఎదుగుదలకి ఆటంకమవుతాయి. అసూయ, ద్వేషాల వంటి దుర్గుణాలకు స్వస్తి చెప్పాలి. తమ పని మీద ఫోకస్ పెట్టాలి. ఎవరికి వారు బెస్ట్ అవడానికి కృషి చేయాలి.

# జాతీయ వేదికపై మెరిసిన తెలంగాణ కరాటే వీరులు




జపాన్ కరాటే అసోసియేషన్ (JKA) ఇండియా ఆధ్వర్యంలో గువాహటి వేదికగా నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో తెలంగాణ కరాటే ఆటగాళ్లు అద్భుత ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రానికి గర్వకారణమయ్యారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో తెలంగాణ జట్టు మొత్తం 34 పతకాలు సాధించి విశేష విజయాన్ని నమోదు చేసింది. ఈ పతకాలలో 12 స్వర్ణాలు, 13 రజతాలు, 9 కాంస్యాలు ఉండటం విశేషం. సంప్రదాయ తెల్ల కరాటే యూనిఫాంలో మెడలో మెడల్స్‌తో, చేతుల్లో సర్టిఫికెట్లతో ఉత్సాహంగా నిలిచిన ఈ యువ క్రీడాకారులు విజయోత్సాహంతో జాతీయ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అభినవ్, సాయి చరణ్, తనుష్, నిశ్వాంత్, సువిధ్, నితిన్ తదితర క్రీడాకారులు కోచ్‌లు, అధికారులతో కలిసి ఈ ఘనతను చిరస్మరణీయంగా మలిచారు. అండర్–10, అండర్–12, అండర్–14, అండర్–18 వయసు విభాగాల్లో యువత ప్రతిభ చాటగా, సీనియర్ విభాగాల్లోనూ ఆటగాళ్లు తమ సత్తా నిరూపించారు. ముఖ్యంగా కాటా, కుమిటే విభాగాల్లో చూపిన సాంకేతిక నైపుణ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. తెలంగాణ యువత క్రీడల్లో సాధిస్తున్న నిరంతర ఎదుగుదలకు ఈ విజయం ప్రతీకగా నిలుస్తోంది. ఈ ఫలితాలతో రాష్ట్రంలో కరాటే క్రీడకు మరింత గుర్తింపు లభించడమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలకు ఇది బలమైన ప్రేరణగా మారుతుందని క్రీడా వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

– బాలచెలిమి డెస్క్

## IIT ఢిల్లీ స్కూల్ యూత్ ఐడియాథాన్‌లో టీమ్ 'అగ్రోనెక్స్ డ్రీమర్స్' - టాప్ 125 ఘనత

భారతదేశంలో పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన అతిపెద్ద ఆవిష్కరణ పోటీ అయిన స్కూల్ యూత్ ఐడియాథాన్ (SYI) లో మా విద్యార్థులు విశేష విజయాన్ని సాధించారు. ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్ నగర్, హైదరాబాద్ (తెలంగాణ రాష్ట్రం) తొలిసారి పాల్గొని దేశవ్యాప్తంగా వచ్చిన 1,02,800 ఎంట్రీలలో టాప్ 125 జట్లలో స్థానం సంపాదించింది. టీమ్ 'అగ్రోనెక్స్ డ్రీమర్స్' – కర్తిక, దివ్య, అద్వైత్, కీర్తన (9వ తరగతి), మెంటర్ శ్రీమతి ఎన్.ఎస్. లత గారి మార్గదర్శకత్వంలో టాప్ 2000, టాప్ 500 దశలను దాటి ఈ ఘనత సాధించారు. వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ లభించి, IIT ఢిల్లీలో తమ ప్రోటోటైప్‌ను ప్రదర్శించే అవకాశం దక్కింది. ఇది పాఠశాలకూ, తల్లిదండ్రులకూ అపార గర్వకారణం.



కథ

# అమ్మ భాషకు జయహో!



(ఫిబ్రవరి 21, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా)

విక్రమసింహుడు తెలుంగ రాజ్యానికి మహారాజు. ప్రజల సుఖసంతోషాలే తన పరమావధిగా భావించి రాజ్యాన్ని పాలించేవాడు. ప్రజల అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ కొత్త ఆలోచనలు చేస్తూ, అవసరమైన సౌకర్యాలను కల్పించేవాడు. ముఖ్యంగా పిల్లల భవిష్యత్తుపై అతనికి అపారమైన శ్రద్ధ ఉండేది. పిల్లలు చదువుతో పాటు కళల్లోనూ నైపుణ్యం సాధించాలనే లక్ష్యంతో, అతడు విశాలమైన ప్రదేశంలో ఒక ఆదర్శ విద్యాలయాన్ని స్థాపించాడు. ఆ విద్యాలయంలో పాఠ్యాంశాలకే కాకుండా ఆటలు, సంగీతం, నృత్యం, సాహిత్యం, చిత్రలేఖనం వంటి అన్ని కళలకు సముచిత స్థానం కల్పించాడు.

ఒక రోజు మహారాజుకు తాను ఏర్పాటు చేసిన విద్యాలయం ఎలా నడుస్తోందో ప్రత్యక్షంగా చూడాలనే కోరిక కలిగింది. వెంటనే మహామంత్రి సోమనాథునితో కలిసి రథంలో విద్యాలయానికి బయలుదేరాడు. విద్యాలయ ముఖద్వారం వద్దకు చేరగానే గురువుల బోధనల శబ్దాలు, సంగీత రాగాలు, పిల్లల ఉల్లాస ధ్వనులు అతని చెవులకు వినిపించాయి. అది విని మహారాజు ఎంతో ఆనందించాడు. ప్రధానాచార్యుడు గౌరవపూర్వకంగా స్వాగతించి, విద్యార్థుల పురోగతిని వివరించాడు. ఒక్కొక్క తరగతిని చూపిస్తూ విద్యార్థులు చదువులోనూ, కళల్లోనూ ఎంత ఉత్సాహంగా పాల్గొంటున్నారో వివరించాడు. తర్వాత వారు గ్రంథలయానికి వెళ్లారు. అక్కడ వివిధ భాషల నిఘంటువులు, గ్రంథలను చూసిన మహారాజుకు ఒక ఆలోచన కలిగింది. "ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నాయి కదా! వాటిలో నిజంగా గొప్ప భాష ఏది?" అని ప్రశ్నించాడు. దీనికి ప్రధానాచార్యుడు, ఈ ప్రశ్నకు బహుభాషాజ్ఞాని మాత్రమే సమాధానం చెప్పగలడని వినయంగా తెలిపాడు.

వెంటనే మహారాజు ఆదేశంతో ప్రపంచం నలుమూలల నుండి వివిధ భాషా పండితులను, బహుభాషాజ్ఞాని భాస్కరుడిని రాజ్యానికి ఆహ్వానించారు. సభ ఘనంగా ప్రారంభమైంది. ఒక్కొక్క పండితుడు తన భాష గొప్పదనాన్ని చక్కగా వివరించాడు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు ఆంగ్లం, ఫ్రెంచ్, జర్మన్ వంటి భాషల పండితులు కూడా తమ భాషల విశిష్టతను వివరించారు. అందరి మాటల్లోనూ గర్వం, ప్రేమ స్పష్టంగా కనిపించింది. అందరి ప్రసంగాలు ముగిసిన తరువాత భాస్కరుడు లేచి నిలబడి ఇలా అన్నాడు. "పండితులారా! మీరు మాట్లాడిన ప్రతి భాష మధురంగా అనిపించింది. ఎందుకంటే అవన్నీ మీ మీ అమ్మ భాషలు. తల్లి నుంచి నేర్చుకున్న భాషలో సహజమైన ప్రేమ, భావోద్వేగం ఉంటుంది. మనం ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు, మాట్లాడవచ్చు. కానీ అమ్మ భాషకు సమానమైనది ఈ ప్రపంచంలో మరొకటి లేదు. ప్రతి ఒక్కరి అమ్మ భాష వారికి గొప్పదే. ఒకరి తల్లి గొప్పది, మరొకరి తల్లి తక్కువ అని ఎలా అనగలం?" భాస్కరుడి మాటలు విన్న సభ మొత్తం ఉత్సాహంతో కరతాళధ్వనులతో మార్మోగింది. మహారాజు ఆనందంతో అతడిని పట్టు శాలువాతో సత్కరించాడు. అనంతరం మహారాజు ఇలా అన్నాడు: "బహుభాషలు నేర్చుకోవడం అవసరం. అవి జ్ఞానాన్ని విస్తరిస్తాయి. కానీ అమ్మ భాషే మన ఆలోచనలకు, సృజనకు మూలం. అందుకే ప్రతి భాషను గౌరవించాలి, ముఖ్యంగా మన అమ్మ భాషను ప్రేమించాలి." అంతటితో సభ ముగిసింది. అందరూ ఏకస్వరంతో నినదించారు.


"అమ్మ భాషకు జయహో! జయ జయ జయహో!"

– డా. ఉప్పల పద్మ
m : 9959126682

ఆట

# గుడ్డి కొంగ





**ఎంత మంది పాల్గొనవచ్చు –**
**పది మంది వరకు**

**ఎక్కడ ఆడవచ్చు –**
**ఖాళీ స్థలంలో**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు –**
**కళ్ళగంతలాట**

'గుడ్డికొంగ' ఆట ఒక రకంగా దొంగాటలాంటిది. విశాలమైన ఆట స్థలంలో హద్దులు గీసుకొని ఆడతారు.

ఖాళీ స్థలంలో నాలుగు వైపులా హద్దులు నిర్ణయించుకొని ఆడతారు. ఈ హద్దులు మరీ ఎక్కువ దూరంలో ఉండకూడదు. అందులోనే గీత దాటకుండా దొంగను పట్టుకోవాలి. పంటలు వేసుకొని దొంగను నిర్ణయించి, దొంగ అయిన వాళ్ళ కళ్ళకు గంతలు కట్టాలి. దొంగ అయిన వాళ్ళు గుడ్డి కొంగ అవుతారు. అతను మిగతా వాళ్ళను గీత దాటకుండా పట్టుకోవాలి. అదే సమయంలో ఆట ఆడే మిగతా వాళ్ళు అతన్ని ఆట పట్టిస్తూ అరుస్తూ ఉండాలి. గుడ్డి దొంగగా నటిస్తున్న వారు వాళ్ళ అరుపులను లేదా కదలికలను గుర్తించి పట్టుకోవాలి. చేతులను అన్ని దిక్కులా వేగముగా తిప్పుతూ, ఇతరులను తాకే ప్రయత్నము చేయాలి. పట్టుబడిన వాళ్ళు మళ్ళీ గుడ్డి కొంగగా మారుతారు. ఆట ఇలా కొనసాగుతుంది.

**ప్రయోజనం :**

- పూర్తి సామర్థ్యాలు లేనప్పుడు (ఉదాహరణకు ఈ ఆటలో చూడలేకపోవటము), తనకు ఉన్న ఇతర సామర్థ్యాలను వాడి, సాధించవచ్చన్న పట్టుదల ఈ ఆట ద్వారా వస్తుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

కథ



# వెండి గిట్ట

## పావెల్ బజోవ్

అనగనగా ఒక ఊరిలో కొకొవాన్య అనే ముసలి వేటగాడు ఉండేవాడు. అతను ఒంటరివాడు. ఎవరినన్నా పెంచుకుందామని ఇరుగు పొరుగు వారిని అడిగాడు. గ్రెగరీ వాళ్ళ పిల్లలు అనాథలని, పెద్ద పిల్లలు కుట్లు అల్లికలకు వెళ్ళిపోయారని, ఓ ఆరేళ్ళ చిన్న పాప దార్యా ఉందని చెప్పారు.

వేటగాడు దార్యాని, ఆ పాప పెంపుడు పిల్లిని ఇంటికి తీసుకొచ్చాడు. వేటగాడు మేకలను వేటాడటానికి అడవిలోకి వెళ్ళేవాడు. దార్యా ఇల్లు సర్దేది. పిల్లి ఎలుకలను వేటాడేది. రాత్రిళ్ళు వేటగాడు, పాపకి, పిల్లికి ఎన్నో చిత్ర విచిత్రమైన కథల్ని చెప్పేవాడు.

ఒకరోజు వేటగాడు ఒక వెండి గిట్ట ఉన్న మేక గురించి చెప్పాడు. తను ఎంతో కాలంగా దాని కోసం వెతుకుతున్నానని చెప్పాడు. పాపకు ఈ విషయం ఎంతో ఆసక్తి కలిగించింది. అప్పటి నుండి ఆ మేక గురించి అడిగేది.

"తాతా! తాతా! ఆ మేకకు ఎన్ని కొమ్ములుంటాయి?" అడిగింది పాప.

"ఐదు" అని చెప్పాడు తాత.

"ఆ మేకకు వెండి గిట్ట ఏ కాలుకు ఉంటుంది? దానివల్ల ఉపయోగమేమిటి?" అడిగింది పాప.

"ఆ మేక కుడి కాలుకు వెండి గిట్ట ఉంటుంది. అది దాని కుడి కాలుతో నేలను ఒకసారి కొడితే ఒక వజ్రం లేదా రత్నం రాలుతుంది. అది రెండు సార్లు నేలను కొడితే రెండు వజ్రాలు రాలుతాయి. అది నేలకు బరికితే వజ్రాల కుప్పే" అన్నాడు తాత.

"ఆ మేక శరీరం నుండి ఏ వస్తుంది?" అడిగింది పాప.

"అది మామూలు మేక కాదు. అడవి మేక. దాని శరీరం నుండి అడవి సువాసన వస్తుంది" అని చెప్పాడు తాత.

కొన్ని నెలల తర్వాత శీతాకాలంలో మేకల వేట కోసం, అడవిలోకి చాలా దూరం వెళ్ళాల్సి వచ్చింది వేటగాడికి. కొన్ని రోజుల వరకు రానని చెప్పాడు.

"మరి రాత్రిళ్ళు అడవిలో ఎలా ఉంటావు?" అడిగింది పాప.

"అక్కడ మనకో వెచ్చటి గుడిసె ఉంది" అన్నాడు తాత.

"మరి అక్కడకు వెండి గిట్ట మేక వస్తుందా?"

"ఏమో తెలీదు. వస్తే రావచ్చు".

"మరైతే నేనూ వస్తా. నన్నూ నీతో తీసుకుపో" అని ఏడ్చింది.

వద్దని సర్దిచెప్పటానికి ప్రయత్నించినా వినలేదు. తప్పని పరిస్థితుల్లో పాపని తీసుకొని స్లెడ్జ్‌బండిపై బయలుదేరారు. పిల్లి వాళ్ళను అనుసరించింది.

అడవిలోని ఇంట్లో పాప, పిల్లి ఉండేవారు తాత మేకలను వేటాడుకొచ్చి, వాటి తోళ్ళను వేరు చేసి, మాంసాన్ని ఉప్పులో ఊరపెట్టేవాడు.

"తాత! మరి మాంసం చాలా జమయ్యింది. మరి

నువ్వు ఇది తీసుకెళ్ళటానికి, ఊరి నుండి గుర్రాన్ని తెచ్చుకో" అంది పాప.

"తెలివైన పిల్లవి నువ్వు" అని చెప్పి, ఊర్లోకి బయలుదేరాడు తాత.

మొదటి రోజు రాత్రి కిటికి దగ్గర కూర్చున్న పాపకు వెండిగిట్ట ఉన్న మేక, ఐదు కొమ్ములతో కనిపించింది.

కల అనుకుంది పాప. రెండవ రోజు రాత్రి కూడా కనిపించింది.

ఈ విషయాన్ని పిల్లికి చెప్పింది. ప్రతీ రోజూ దిగులుగా తాత కోసం ఎదురు చూసేది.

మూడవ రోజు రాత్రి ఇంటిపై ఎవరో కదులుతున్నట్లు, తలుపులు తట్టినట్టు అనిపించింది. ధైర్యంగా తలుపులు తీసి బయటకు వెళ్ళి చూసింది.

వెండిగిట్ట మేక కొన్ని వజ్రాలను అప్పటికే రాల్చింది.

పిల్లికి కోపం వచ్చి మేకను గుర్రుగా చూసింది.

మేక పిల్లిని వెంబడిస్తూ తన వెండిగిట్టను నేలకేసి కొడుతూ ఉంది. అలా పిల్లి, మేక ఇంటి చుట్టూ చాలా సార్లు తిరిగాయి. ఇంటి పైకప్పు మీదకి గెంతాయి.



ఇంటి చుట్టుపక్కల, ఇంటి పైకప్పు అంతా ఎరుపు, పచ్చ, పసుపు రత్నాలు, వజ్రవైఢూర్యాలతో నిండిపోయింది. ఆ ప్రదేశమంతా కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది.

అప్పుడే అక్కడకు గుర్రం మీద చేరిన తాత, ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. తన టోపీ నిండుగా వజ్రాలను ఏరాడు. వెండిగిట్ట మేక, పిల్లి హఠాత్తుగా మాయమయ్యాయి.

"తాత! ఇంటిపై నున్న వజ్రాలను ఏరవద్దు, మనం ప్రొద్దున దాకా ఈ అందమైన దృశ్యాన్ని చూద్దాం" అంది పాప.

రాత్రి మంచు కురిసింది. ప్రొద్దున పైకప్పునున్న మంచు తొలగించి చూస్తే వజ్రాలు కూడా మాయం అయ్యాయి.


అయితేనేం, వాళ్ళ వద్ద టోపీ నిండుగా వజ్రాలు ఉన్నాయి. తమకు అవి చాలు అనుకున్నారు.

పాప, తాత ఆనందంతో ఊరికి చేరారు.

స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971

ఇంగ్లీష్ : సిల్వర్ హూఫ్
రచయిత : పావెల్ బజోవ్
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

# కొంగలూ, తాబేలు



కె. శ్రీకృష్ణ సాయి ప్రస్తుతం ప్రభుత్వ D.I.E.T., బొమ్మూరు (రాజమండ్రి)లో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. బాలల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు పలు రచనలు చేశారు. Play with Periodic Table అనే పుస్తక రచయిత. ఆయన వ్యాసాలు The Hindu - Young World లో ప్రచురితమయ్యాయి. రేవతి సైన్స్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు learning by doing కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెకుముకి పత్రికలో Think and Try కాలమ్ రచయిత.



ఒకప్పుడు ఓ అందమైన అడవిలో పెద్ద చెరువు ఉండేది. ఆ చెరువులో స్వచ్ఛమైన నీరు, పచ్చని చెట్లు, చుట్టూ పక్షుల కిలకిలలతో చాలా అందంగా ఉండేది. ఆ చెరువులో ఒక తాబేలు అలాగే రెండు కొంగలు కూడా ఉండేవి. ముగ్గురూ చాలా మంచి స్నేహితులు. వాటి జీవితం హాయి గా ఉండేది. వర్షాలు పడకపోవడంతో చెరువులో నీరు తగ్గిపోయింది.

కొంగలు ఒక రోజు తాబేలుతో ఇలా అన్నాయి: "స్నేహితుడా, ఇక్కడ నీరు పూర్తిగా ఎండిపోతోంది. మేము ఇంకో పెద్ద చెరువుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. కానీ నిన్ను వదిలి వెళ్లడం మనసుకు రావడం లేదు."తాబేలు బాధగా అంది: "నన్ను కూడా తీసుకెళ్లండి. లేకపోతే నేను ఇక్కడే చనిపోతాను."

కొంతసేపు ఆలోచించిన తర్వాత తాబేలు ఒక ఉపాయం చెప్పింది: "మీరిద్దరూ ఒక కర్రను మీ ముక్కులతో పట్టుకోండి. నేను ఆ కర్ర మధ్యలో నా నోటితో పట్టుకుంటాను. అలా మనం కలిసి ఎగురవచ్చు."

కొంగలు కొంచెం ఆలోచించి అంగీకరించాయి. కానీ ఒక షరతు పెట్టాయి: "ఎగురుతున్నప్పుడు నువ్వు నోరు తెరవకూడదు. మాట్లాడితే ప్రమాదం జరుగుతుంది." తాబేలు ఒప్పుకుంది. కొంగలు కర్రను పట్టుకొని ఆకాశంలోకి ఎగిరాయి. తాబేలు మధ్యలో కర్రను గట్టిగా పట్టుకుని వేలాడుతుంది. వాటి ప్రయాణం ఒక ఊరు మీదగా వెళుతుండగా, క్రింద ఉన్న గ్రామస్తులు ఇది చూసి ఆశ్చర్యపోయారు.


"అరే! తాబేలు ఎగురుతోంది!" అని పెద్దగా అరవడం మొదలుపెట్టారు అలాగే నవ్వసాగారు. తాబేలుకు కోపం వచ్చి ఎందుకు అలా అరుస్తారు, అని అతనికి నోరు తెరిచి చెప్పాలని అనిపించింది, నోరు తెరిచిన క్షణంలోనే కర్ర తాబేలు కిందపడిపోయి మరణించింది.

### ఈ కథలో సైన్స్ గురించి తెలుసుకొందామా?

ఈ కథలో ప్రధానంగా గురుత్వాకర్షణ శక్తి (Gravity) ఇంకా బలాల సమతుల్యత (Balance of Forces) అనే శాస్త్రీయ సూత్రాలు కనిపిస్తాయి. తాబేలు బరువు భూమి వైపు లాగబడుతుంది. దీనిని గురుత్వాకర్షణ అంటారు. కొంగలు తాబేలును ఎగురవేసేటప్పుడు తమ రెక్కల సహాయంతో పైకి లేపే బలాన్ని (Lift Force) ఉపయోగిస్తాయి. తాబేలు నోరు మూసుకుని కర్రను గట్టిగా పట్టుకున్నప్పుడు, పై బలం, కింద బలం సమంగా ఉండి తాబేలు గాల్లో తేలుతుంది. కానీ తాబేలు మాట్లాడేందుకు నోరు తెరిచినప్పుడు, కర్రను వదులుట వలన, అప్పుడు పైకి లేపే బలం తగ్గిపోతుంది. ఫలితంగా గురుత్వాకర్షణ బలం ఎక్కువై, తాబేలు కింద పడిపోయింది. ఇది న్యూటన్ రెండవ నియమం ($F = ma$) ప్రకారం జరుగుతుంది. అలాగే ఇది సమతుల్యత కోల్పోవడం (Loss of equilibrium) వల్ల జరిగిన ప్రమాదం.

### పక్షులు ఎలా ఎగురుతాయి?

పక్షులు తమ రెక్కల సహాయంతో గాల్లో ఎగురుతాయి. పక్షుల రెక్కలు ప్రత్యేకమైన ఏరోఫాయిల్ ఆకారం (Aerofoil shape)లో ఉంటాయి. రెక్కల పైభాగం వంపుగా, కిందభాగం సూటిగా ఉంటుంది. దీనివల్ల గాలి పైభాగంలో వేగంగా ప్రవహించి, కిందభాగంలో నెమ్మదిగా ప్రవహిస్తుంది. దీనివల్ల పైభాగంలో తక్కువ ఒత్తిడి, కిందభాగంలో ఎక్కువ ఒత్తిడి ఏర్పడి లిఫ్ట్ (Lift force) అనే పైకి లేపే బలం ఏర్పడుతుంది. పక్షులు రెక్కలను కిందికి కొట్టినప్పుడు గాలిని కిందకు నెట్టుతాయి. దీనికి ప్రతిచర్యగా గాలి పక్షులను పైకి నెడుతుంది. ఇది న్యూటన్ మూడవ నియమం (Action - Reaction) ఆధారంగా జరుగుతుంది. ఈ కదలికను డౌన్ స్ట్రోక్ అంటారు. పైకి రెక్కలను తీసుకెళ్లేటప్పుడు అప్ స్ట్రోక్ జరుగుతుంది, ఇది గాలి ప్రతిఘటన తగ్గించడంలో సహాయ పడుతుంది. అలాగే పక్షుల శరీరం తేలికగా ఉండటం, ఎముకలు లోపల ఖాళీగా ఉండటం, బలమైన ఛాతీ కండరాలు ఉండటం వల్ల అవి సులభంగా ఎగురగలుగుతాయి. ఈ విధంగా లిఫ్ట్, థ్రస్ట్, తక్కువ బరువు ఇంకా గాలి ఒత్తిడి కలిసి పక్షులు ఆకాశంలో ఎగరడానికి సహాయపడతాయి.



### తాబేలు ఎందుకు కింద పడిపోయింది?

తాబేలు కొంగలతో కలిసి ఎగురుతున్నప్పుడు ఒక కర్రను నోటితో పట్టుకుంది. ఆ సమయంలో కొంగలు పైకి లేపే బలం (Lift force) అలాగే తాబేలు బరువు (Gravity) రెండూ సమంగా ఉండడంతో తాబేలు గాల్లో ఉండగలిగింది. దీనిని బలాల సమతుల్యత (Balance of Forces) అంటారు. కానీ తాబేలు మాట్లాడడానికి నోరు తెరిచినప్పుడు కర్రను వదిలేసింది. అప్పుడు పైకి లేపే బలం పూర్తిగా తగ్గిపోయింది. వెంటనే గురుత్వాకర్షణ శక్తి (Gravity) ఎక్కువగా పని చేసి తాబేలు కింద పడిపోయింది. ఇది న్యూటన్ రెండవ నియమం ($F = ma$) ప్రకారం జరిగింది. అంటే పైకి లేపే బలం లేకపోవడం, సమతుల్యత కోల్పోవడం, గురుత్వాకర్షణ ఎక్కువగా పని చేయడం వల్ల తాబేలు కింద పడిపోయింది.

– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320

# రెండు వేల ఏండ్ల కింద హిందూ మతం



(Limestone-Marble sculpture of Satavahana's Greatest emperor 'Gautamiputra Sri Satakarni' (65-86 CE) recovered from "Amaravati" but now languishing in London Museum along with 120 other exquisite Marbles of Satavahana art works (a seperate gallery is dedicated for Amaravati marbles))

శాతవాహన రాజుల కాలంలో హిందూ మతాంశాలైన వైదిక క్రతువులు, పౌరాణిక భక్తి, మత శాఖలైన వైష్ణవం, శైవం, శక్తి మత శాఖలు ఒకటి తరువాత ఒకటి వ్యాపించినట్లు గోచరిస్తున్నాయి.

నాణేఘాట్ శాసనంలో వైదిక మతం, భాగవత/భక్తి మతం రెండు అంశాలూ కనబడుతున్నాయి. ఆ శాసనాన్ని వేయించిన నాగానిక తనను 'దిఖావ్రత యజ్ఞ సుందయా' అనీ, 'యజ్ఞహుత ధూపన సుగంధయా' అనీ వర్ణించుకోవడం, తన భర్త శాతకర్ణిని రెండు అశ్వమేధ యాగాలతోపాటు రాజసూయ, అగ్న్యాధేయ, అప్తోర్యామ, అనారంభణీయ, దశరాత్ర, త్రయోదశ రాత్ర, త్రిరాత్రాది క్రతువులు నిర్వహించి బ్రాహ్మణులకు గోదాన, భూదాన, సువర్ణ దానాలిచ్చి సంతృప్తిపరిచినవానిగా పేర్కొనడం, తమ కుమారుని పేరును వేదసిరిగా పేర్కొనడం తొలి శాతవాహనులు వైదిక క్రతు మతాన్ని అవలంభించారు అనడానికి నిదర్శనాలు.

అయితే అదే శాసనం వైదిక దేవతలతోపాటు భాగవత దేవతలైన సంకర్షణ, వాసుదేవ ప్రార్థనతో ప్రారంభిస్తున్నది. ఇది బ్రాహ్మణ/పౌరాణిక మత ప్రవేశాన్ని, ప్రాచుర్యాన్ని తెలుపుతుంది. శ్రీముఖుని (సిముక), కృష్ణుని (కన్న) పేర్లు కూడా వైష్ణవ మత ప్రాధాన్యతను తెలుపుతున్నాయి.

నాసిక్ శాసనం గౌతమీపుత్ర శాతకర్ణిని పౌరాణిక వీరులతో పోలుస్తున్నది. అతని శాసనాలపై కూడా వైష్ణవ మత చిహ్నాలు కనిపిస్తున్నాయి. హాలుని "గాథాసప్తశతి" లోని రాధాకృష్ణ, విష్ణు అవతార కథలు పౌరాణిక వైష్ణవ మత ప్రాధాన్యాన్నే తెలుపుతున్నాయి.

అయితే అదే గాథాసప్తశతి గౌరీ పశుపతుల ప్రార్థనతో ప్రారంభం కావడం, గణపతి, శక్తి ఆలయాలను ప్రస్తావించడం, పార్వతీ కళ్యాణం కథను చెప్పడం నాటి శివ-శక్తి మతాల ఉనికిని తెలియజేస్తుంది. శాతవాహన రాజు 'పులుమావి' అనే తెలుగు పదానికి అర్థం స్కంధుడు లేదా కార్తికేయుడు అని, తరువాత శివస్కంధ, శివశ్రీ అనే మరి శాతవాహన రాజుల పేర్లు, శాతవాహన నాణేలపై గల స్కంధుడు శైవమత ప్రాచుర్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి. గుడిమల్లం (చిత్తూరు జిల్లా) శివలింగం కూడా క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాటిదని, శాతవాహనుల పూజలు అందుకున్నదని తెలుస్తున్నది. శాతవాహనుల కాలంలోనే ప్రసిద్ధమైన "శివ మహిమ్న స్తోత్రం" సంకలించబడిందని చెప్తారు.

నాణేలపై, శాసనాలపై గల స్వస్తిక్, నందిపాదం మొదలైన చిహ్నాలు కూడా బ్రాహ్మణ, పౌరాణిక మత ప్రాచుర్యాన్ని తెలుపుతున్నాయి.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078



# మేత - మోత

మూత తియ్యి.. మేత మెయ్యి
మేత మెయ్యి.. కోత కొయ్యి
కోత కొయ్యి.. మోపు మొయ్యి
మోపు మొయ్యి.. మేత తియ్యి
మేత తియ్యి.. మేత వెయ్యి
మేత వెయ్యి.. కుడితి పొయ్యి
కుడితి పొయ్యి.. తౌడు వెయ్యి
పాలు పితుకు.. మనిషి బతుకు..

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105


# సంప్రదాయ నృత్యంలో మెరిసిన త్రివర్ణ సౌందర్యం

భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయానికి ప్రతీకలుగా నిలిచిన ముగ్గురు యువ నర్తకీమణులు నేత్ర, నందికా, అన్వి సైన్‌లు తమ నాట్య ప్రదర్శనతో కళాభిమానులను మంత్రముగ్ధులను చేశారు. పసుపు – నీలం వర్ణాల సమ్మేళనంతో అలంకరించిన ఆకర్షణీయమైన నాట్యవస్త్రాలు, సుందరమైన బంగారు ఆభరణాలు, శిరోభూషణం, నుదుటి బొట్టు కలిసి వారి రూపానికి విశిష్టమైన శిల్పసౌందర్యాన్ని ఆవిష్కరించాయి.

కళ్లలో కనిపించిన అభినయ కౌశలం, ముఖహావభావాలలో ప్రతిబింబించిన ఆత్మవిశ్వాసం వారి శాస్త్రీయ నృత్య సాధనకు స్పష్టమైన నిదర్శనంగా నిలిచాయి. శివాంశ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన శ్రీమతి మైత్రిరావు గారి మార్గదర్శకత్వంలో భరతనాట్యంలో శిక్షణ పొందిన ఈ యువ నర్తకీమణులు, సంప్రదాయ నాట్యంలోని సౌందర్యాన్ని సజీవంగా ప్రేక్షకుల ముందుంచారు.



హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారి సున్నితమైన భావ వ్యక్తీకరణ, లయబద్ధమైన అడుగులు ప్రేక్షకులను ఆకట్టుకుని, భారతీయ శాస్త్రీయ నృత్య వారసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలిచాయి.







# కాగితం గొట్టం నుండి స్టెతస్కోపు

ఫ్రాన్స్‌లోని పారిస్ నగరంలో 'నెకర్ హాస్పిటల్' అని ఉంది. ఆ హాస్పిటల్‌లో ప్రధాన వైద్యుడు డాక్టర్ రెనే లీనెక్ ఆయన పూర్తి పేరు రెనేతియోడర్ హైయాసింటే.

ఒక రోజు ఒక యువతి ఆ ఆసుపత్రికి వచ్చింది. ఆమె చాలా కాలం నుండి గుండె జబ్బుతో బాధపడుతోంది.

ఆ రోజుల్లో గుండెను పరీక్ష చేయటానికి పరికరాలు ఏమీ లేవు. రోగుల గుండె కొట్టుకోవటాన్ని పరిశీలించ వలసిన డాక్టరు ఆ రోగి గుండెల మీద గాని, వీపు మీద గాని చెవిని ఉంచి పరీక్షించవలసి వచ్చేది. ఈ విధంగా చేయటం అవమానమని చాలా మంది డాక్టర్లు అనుకొనే వారు.

అందుకని ఆ యువతిని పరీక్షించాల్సిన ఆ డాక్టరు గారికి అదొక సమస్య అయింది. ఆమె చూడబోతే వయస్సులో ఉంది. గుండె దగ్గర చెవిని ఉంచాలి.

'ఆ యువతిని పరీక్ష చేయకుండా ఉందామా?' అంటే అది తన వృత్తికే అన్యాయం చేసినట్లు. అలా ఆలోచిస్తున్న ఆయనకు తన బల్ల మీద ఓ పొడవాటి గట్టి కాగితం ఉండటం కనిపించింది. వెంటనే ఆ కాగితాన్ని తీసుకొన్నాడు. గట్టిగా, పొడుగ్గా సన్నటి గొట్టంలా చుట్టాడు.

ఆ గొట్టం ఒక వైపున ఆ యువతి గుండెల దగ్గర ఉంచాడు. రెండో వైపును తన చెవి దగ్గర ఉంచుకున్నాడు. గుండెల మీద చెవిని ఉంచి పరీక్ష చేసేటప్పటికంటే కూడా గుండె చప్పుడు స్పష్టం గాను, చక్కగాను వినిపించింది. అతడు ఆశ్చర్యపోయాడు.

ఆ రోగిని పరీక్షించి పంపివేశాడు. తరువాత గొట్టంతో చాలా ప్రయోగాలు చేశాడు. గుండెల మీద చెవిని ఉంచి పరిశీలించే కంటే గొట్టంతో పరిశీలించటమే మంచిదని నిర్ధారణకి వచ్చాడు.

ఎప్పుడూ చెడిపోకుండా ఉండటానికని రబ్బరు గొట్టాన్ని తీసుకున్నాడు. చెవుల్లో పెట్టుకోవడానికి రెండు వైపులా, గుండెల మీద ఉంచటానికి ఒక వైపున ఏర్పాటు చేశాడు. అంతే! ఆ పరికరాన్ని అందుబాటులో ఉన్న అందరికీ చూపించాడు. తరువాత ఆ పరికరం చాలా ప్రచారంలోకి వచ్చింది. దాని పేరే 'స్టెతస్కోపు'. అప్పుడు అతని వయస్సు 28 సంవత్సరాలు.

ఇపుడు ప్రపంచంలో ఏ మూల చూసినా స్టెతస్కోపులు లేని డాక్టర్లు గాని ఆసుపత్రులు గాని కనిపించరు.

– 'బాల కథా సౌరభం' నుండి...

# నీవెంటే నేనుంటా

1. ఒక స్లిప్‌పై ఒక అంకెను (సున్న తప్ప) రహస్యంగా రాసి వారి దగ్గరే పెట్టుకుంటారు. 2. మెజీషియన్ కొన్ని స్లిప్స్‌పై ఒక అంకె (సున్న తప్ప)ను రహస్యంగా రాసి ప్రేక్షకులకు ఇస్తారు. 3. ప్రేక్షకుల అంకె మెజీషియన్‌కు, మెజీషియన్ అంకె ప్రేక్షకులకు తెలియదు. 4. ప్రేక్షకుల అంకెను మెజీషియన్ (రహస్యంగా రాసుకున్నది) 2తో గుణించుకోమని చెప్పండి. 5. ఆ జవాబుకు 2ను కలపమనండి. 6. ఆ జవాబును 5తో గుణించమనండి. 7. ఆ జవాబు నుండి మీరు చెప్పిన అంకెను తీసివేయమని చెప్పండి. 8. ఇప్పుడు వచ్చిన జవాబులోని పదుల స్థానం అంకె ప్రేక్షకులది, ఒకట్ల స్థానం అంకె మెజీషియన్ రహస్యంగా రాసినది.

**ఉదా :** ప్రేక్షకుల అంకె 9 మెజీషియన్ అంకె 6

9×2=18 18+2=20

20×5=100 100−4=96

9 ప్రేక్షకులది, 6 మెజీషియన్‌ది.

రహస్యం : మెజీషియన్ చెప్పవలసిన అంకె (10−) మెజీషియన్ రహస్యంగా రాసిన అంకె

6ను రహస్యంగా రాస్తే 4 తీసివేయాలని చెప్పాలి.

5ను రహస్యంగా రాస్తే 5 తీసివేయాలని చెప్పాలి.

7ను రహస్యంగా రాస్తే 3 తీసివేయాలని చెప్పాలి.

## BEAUTY NUMBER

91 x eleven multiplies

91 x 11 = 1001

91 x 22 = 2002

91 x 33 = 3003

91 x 44 = 4004

91 x 55 = 5005

91 x 66 = 6006

91 x 77 = 7007

91 x 88 = 8008

91x 99 = 9009

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937



## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------


మొబైల్ : ------------------

ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com









# కృత్రిమ మేధస్సులో కంప్యూటర్ విజన్ పాత్ర

### కంప్యూటర్ విజన్ అంటే ఏమిటి?

కంప్యూటర్ విజన్ (Computer Vision) అనేది కృత్రిమ మేధస్సు (Artificial Intelligence - AI) లోని ఒక ముఖ్యమైన శాఖ. ఈ సాంకేతికత ద్వారా కంప్యూటర్లు మనిషిలాగా చిత్రాలు (Images), వీడియోలు (Videos), ప్రత్యక్ష దృశ్యాలను (Live Visual Data) చూడటం, అర్థం చేసుకోవటం, విశ్లేషించటం మరియు వాటి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటం నేర్చుకుంటాయి.

### నిర్వచనం:

కంప్యూటర్లకు కళ్ల శక్తి మరియు మెదడు విశ్లేషణ సామర్థ్యాన్ని అందించే సాంకేతికతనే కంప్యూటర్ విజన్ అంటారు. మనిషి కళ్లతో చూసి మెదడుతో ఆలోచించినట్లే, కంప్యూటర్ విజన్ వ్యవస్థలు కెమెరాల ద్వారా పొందిన దృశ్యాలను డేటాగా మార్చి, వాటిని అర్థం చేసుకుని చర్యలు తీసుకుంటాయి.

### కంప్యూటర్ విజన్ ఎలా పని చేస్తుంది?

కంప్యూటర్ విజన్ పని విధానం ప్రధానంగా ఐదు దశల్లో జరుగుతుంది.

మొదటిగా చిత్రం పొందడం (Image Input) జరుగుతుంది. కెమెరా లేదా సెన్సార్ ద్వారా చిత్రం లేదా వీడియో తీసుకుంటారు. ఇది కంప్యూటర్‌కు కంటి పాత్ర పోషిస్తుంది.


రెండవ దశ ప్రీ-ప్రాసెసింగ్ (Preprocessing). ఇందులో చిత్రంలోని శబ్దాన్ని తొలగించడం, పరిమాణం మార్చడం, స్పష్టత పెంచడం వంటి పనులు చేస్తారు. శుభ్రమైన చిత్రం ఉంటే ఫలితం మరింత ఖచ్చితంగా ఉంటుంది.

మూడవ దశ లక్షణాల గుర్తింపు (Feature Extraction). చిత్రంలో ఉన్న అంచులు, ఆకారాలు, రంగులు, నమూనాలు వంటి ముఖ్యమైన లక్షణాలను గుర్తిస్తారు.

నాలుగవ దశ మోడల్ విశ్లేషణ (Model Processing). ముందుగా శిక్షణ పొందిన AI లేదా డీప్ లెర్నింగ్ మోడల్ చిత్రం డేటాను విశ్లేషిస్తుంది.

చివరి దశ ఫలితం లేదా నిర్ణయం (Output). ఇందులో వస్తువును గుర్తించడం, హెచ్చరిక ఇవ్వడం లేదా ఆటోమేటిక్ చర్య తీసుకోవడం జరుగుతుంది.

### కంప్యూటర్ విజన్‌లో ముఖ్యమైన పద్ధతులు




**ఇమేజ్ క్లాసిఫికేషన్ (Image Classification)**

చిత్రం మొత్తం చూసి అది ఏ వర్గానికి చెందిందో నిర్ణయించడం. ఉదాహరణకు చిత్రంలో పిల్లి ఉందా, కుక్క ఉందా అన్నది గుర్తించడం.

**ఆబ్జెక్ట్ డిటెక్షన్ (Object Detection)**

చిత్రంలో ఉన్న ప్రతి వస్తువును గుర్తించి అవి ఎక్కడ ఉన్నాయో చూపించడం. ఇది స్వయంచాలక వాహనాల్లో కీలక పాత్ర పోషిస్తుంది.

**ముఖ గుర్తింపు (Facial Recognition)**

ముఖ లక్షణాల ఆధారంగా వ్యక్తిని గుర్తించే విధానం. మొబైల్ ఫోన్లలో Face Unlock దీనికి మంచి ఉదాహరణ.

**ఇమేజ్ సెగ్మెంటేషన్ (Image Segmentation)**

చిత్రాన్ని చిన్న భాగాలుగా విభజించి ప్రతి భాగాన్ని వేరుగా విశ్లేషించడం. వైద్య రంగంలో ట్యూమర్ గుర్తింపులో ఇది చాలా ఉపయోగపడుతుంది.

**మోషన్ ట్రాకింగ్ (Motion Tracking)**

వీడియోలో కదలికలను నిరంతరం గమనించడం. క్రీడలు, భద్రతా వ్యవస్థల్లో ఇది విస్తృతంగా ఉపయోగిస్తారు.

**కంప్యూటర్ విజన్ ప్రాముఖ్యత (Importance)**

నేటి డిజిటల్ ప్రపంచంలో కంప్యూటర్ విజన్ అత్యంత కీలక సాంకేతికతగా మారింది. ఇది మానవ శ్రమను తగ్గించి, వేగవంతమైన మరియు ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కల్పిస్తుంది.

ఆరోగ్య రంగంలో కంప్యూటర్ విజన్ ప్రాణాలను కాపాడే స్థాయికి ఎదిగింది. X-ray, MRI, CT స్కాన్ల ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం సాధ్యమవుతోంది. బ్రెస్ట్ క్యాన్సర్, మెదడు ట్యూమర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స విజయవంతమవుతుంది.

రవాణా రంగంలో స్వయంచాలక వాహనాలకు కంప్యూటర్ విజన్ వెన్నెముక లాంటిది. రోడ్డు, లేన్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాదచారులను గుర్తించడం ద్వారా ప్రమాదాలను తగ్గిస్తుంది.

భద్రతా రంగంలో ముఖ గుర్తింపు, నంబర్ ప్లేట్ గుర్తింపు ద్వారా నేరాలను నియంత్రించవచ్చు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో భద్రత మరింత మెరుగు పడింది.

వ్యవసాయ రంగంలో పంట ఆరోగ్యం, వ్యాధులు, దిగుబడి అంచనాలు కంప్యూటర్ విజన్ ద్వారా సులభంగా సాధ్యమవుతున్నాయి. ఇది రైతులకు గొప్ప తోడ్పాటు.

### సవాళ్లు


కంప్యూటర్ విజన్‌కు పెద్ద మొత్తంలో డేటా అవసరం. ప్రైవసీ సమస్యలు, డేటాలో పాక్షికత (Bias), అధిక ఖర్చు వంటి సవాళ్లు కూడా ఉన్నాయి. అయినప్పటికీ పరిశోధనలు వీటికి పరిష్కారాలను అందిస్తున్నాయి.


### ముగింపు

కంప్యూటర్ విజన్ అనేది కంప్యూటర్లకు కేవలం చూడటం మాత్రమే కాదు, చూసిన దాన్ని అర్థం చేసుకుని మానవ జీవితాన్ని సులభతరం చేసే శక్తిని ఇస్తుంది. ఆరోగ్యం, భద్రత, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. భవిష్యత్తులో కంప్యూటర్ విజన్ మన దైనందిన జీవితంలో విడదీయరాని భాగంగా మారడం ఖాయం.


– లత

e: ogshydcbse@gmail.com




# లాజికల్ రీజనింగ్ & ఆల్ఫాబెట్ టెస్ట్

గడియారం అనేది ఒక వృత్తం ($360^\circ$), దీనిని 12 గంటలు (గంటకు $30^\circ$) మరియు 60 నిమిషాలు (నిమిషానికి $6^\circ$) గా విభజించారు.

**సూత్రాలు:**

**నిమిషాల ముల్లు:** నిమిషానికి $6^\circ$ కదులుతుంది. **అవర్ హ్యాండ్:** నిమిషానికి $0.5^\circ$ (గంటకు $30^\circ$) కదులుతుంది.

**చేతుల మధ్య కోణం** $(\theta) = (30H - 5.5M)$ or $|(30H - 11/2M)|$ (ఇక్కడ, H = గంట, M = నిమిషాలు)

**ప్రశ్న 1: మధ్యాహ్నం 3:20 గంటలకు గడియారం ముళ్ల మధ్య కోణాన్ని కనుగొనండి.**

**పరిష్కారం:**


**నిమిషాల ముల్లు:**

60 నిమిషాల్లో పూర్తి వృత్తాన్ని (360 డిగ్రీలు) పూర్తి చేస్తుంది. కాబట్టి, ప్రతి నిమిషం, నిమిషాల ముల్లు 6 డిగ్రీలు కదులుతుంది.

**అవర్ హ్యాండ్:** 12 గంటల్లో పూర్తి వృత్తాన్ని (360 డిగ్రీలు) పూర్తి చేస్తుంది.
కాబట్టి, ప్రతి గంటకు, గంటల ముల్లు 30 డిగ్రీలు కదులుతుంది.
కానీ నిమిషాలు గడిచేకొద్దీ గంటల ముల్లు కూడా కదులుతుంది. 60 నిమిషాల్లో, అది 30 డిగ్రీలు కదులుతుంది, కాబట్టి ప్రతి నిమిషం, గంటల ముల్లు 0.5 డిగ్రీలు కదులుతుంది.

**20 నిమిషాల వద్ద మినిట్ హ్యాండ్:** ప్రతి నిమిషం, మినిట్ హ్యాండ్ 6 డిగ్రీలు కదులుతుంది.
20 నిమిషాల వద్ద: $20 \times 6 =$ పై నుండి 120 డిగ్రీలు (12 గంటల స్థానం).

**3:00 వద్ద అవర్ హ్యాండ్:**
సరిగ్గా 3:00 వద్ద, అవర్ హ్యాండ్ పై నుండి $3 \times 30 = 90$ డిగ్రీల వద్ద ఉంటుంది. కానీ అది సరిగ్గా 3:00 కాదు; ఇది 3:20, కాబట్టి అవర్ హ్యాండ్ మరింత ముందుకు కదిలింది. కానీ అది సరిగ్గా 3:00 కాదు; ఇది 3:20,
కాబట్టి అవర్ హ్యాండ్ మరింత ముందుకు కదిలింది. 20 నిమిషాలలో అవర్ హ్యాండ్ కదలిక: ప్రతి నిమిషం,
అవర్ హ్యాండ్ 0.5 డిగ్రీలు కదులుతుంది. 20 నిమిషాలలో: $20 \times 0.5 = 10$ డిగ్రీలు. కాబట్టి, 3:20 వద్ద,
అవర్ హ్యాండ్ పై నుండి $90 + 10 = 100$ డిగ్రీల వద్ద ఉంటుంది.
చేతుల మధ్య కోణాన్ని కనుగొనడం వాటి మధ్య వ్యత్యాసం $120 - 100 = 20$ డిగ్రీలు.





# కలంచెలిమి



**SK. సుభహన**
9వ తరగతి
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సిరిసిల్ల



**కె. వర్షిత్**
9వ తరగతి, నారాయణ స్కూల్, ధనలక్ష్మి పురం, నెల్లూరు



**సృజని**
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
కల్లివెట్టు



**సయ్యద్ అమ్రిన్ నస్త్రా**
10వ తరగతి,
ఖమ్మం



**కె. తేజిత్**
8వ తరగతి. అక్షర పబ్లిక్ స్కూల్,
బి.ఎన్. కండ్రిగ, తిరుపతి జిల్లా



**సిహెచ్ ప్రవళిక**
6వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
చిన్న మాదారం.




# భారత రాజ్యాంగ షెడ్యూల్‌లు పరిపాలన వ్యవస్థకు పునాది

భారత ప్రభుత్వ చట్టం, 1935లో ప్రస్తావించబడింది. ఆ చట్టంలో మొత్తం 10 షెడ్యూల్‌లు ఉన్నాయి. అనంతరం 1949 భారత రాజ్యాంగం, అమల్లోకి వచ్చిన సమయంలో 22 భాగాలలో 395 అధికరణలు మరియు 8 షెడ్యూల్‌లను కలిగి ఉండేది. కాలక్రమేణా జరిగిన సవరణల ఫలితంగా ప్రస్తుతం భారత రాజ్యాంగం 25 భాగాలు, 448 అధికరణలు మరియు 12 షెడ్యూల్‌లతో విస్తరించింది.

**భారత రాజ్యాంగంలోని షెడ్యూల్‌లు**

| షెడ్యూల్స్ | లక్షణాలు |
|---|---|
| **మొదటి షెడ్యూల్** | రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల పేర్లను కలిగి ఉంటుంది. రాష్ట్రాల ప్రాదేశిక అధికార పరిధి కూడా చేర్చబడింది |
| **రెండవ షెడ్యూల్** | **భత్యాలు, ప్రత్యేక హక్కులు, జీతాలకు సంబంధించిన నిబంధనలు:** భారత రాష్ట్రపతి, భారత రాష్ట్రాల గవర్నర్లు, లోక్‌సభ స్పీకర్ & డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ & రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, భారత రాష్ట్రాల శాసనసభల స్పీకర్ మరియు డిప్యూటీ స్పీకర్, భారత రాష్ట్రాల శాసనమండలి ఛైర్మన్ మరియు డిప్యూటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులు, భారత కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ (CAG) |
| **మూడవ షెడ్యూల్** | **ప్రమాణం మరియు ధృవీకరణ రూపాలు:** భారత కేంద్ర మంత్రులు, పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులు, పార్లమెంటు సభ్యులు (MPలు), సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్, రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర శాసనసభ ఎన్నికల అభ్యర్థులు, రాష్ట్ర శాసనసభ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు |
| **నాల్గవ షెడ్యూల్** | రాజ్యసభలో రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు సీట్ల కేటాయింపుకు సంబంధించిన నిబంధనలు. |
| **ఐదవ షెడ్యూల్** | షెడ్యూల్డ్ ప్రాంతాలు మరియు షెడ్యూల్డ్ తెగల పరిపాలన మరియు నియంత్రణకు సంబంధించిన నిబంధనలను కలిగి ఉంటుంది. |

| | |
|---|---|
| **ఆరవ షెడ్యూల్** | అస్సాం, మేఘాలయ, త్రిపుర మరియు మిజోరం రాష్ట్రాలలోని గిరిజన ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన నిబంధనలను కలిగి ఉంది. |
| **ఏడవ షెడ్యూల్** | **ఈ షెడ్యూల్ మూడు శాసనసభ జాబితా :** యూనియన్ జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా |
| **ఎనిమిదవ షెడ్యూల్** | **భారత రాజ్యాంగం గుర్తింపు పొందిన 22 అధికారిక భాషల జాబితా :** అస్సామీ, బెంగాలీ, బోడో, డోగ్రి (డోంగ్రి), గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణి, మథిలి (మైథిలి), మలయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, సంతాలి, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ |
| **తొమ్మిదవ షెడ్యూల్** | భూ సంస్కరణలకు సంబంధించిన రాష్ట్ర చర్యలు మరియు నిబంధనలతో వ్యవహరిస్తుంది మరియు జమీందారీ వ్యవస్థను రద్దు చేయడం. ఇది ఇతర విషయాలతో వ్యవహరించే పార్లమెంటు చట్టాలు మరియు నిబంధనలను కూడా పరిష్కరిస్తుంది. *గమనిక: ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కారణంగా న్యాయపరమైన పరిశీలన నుండి చట్టాలను రక్షించడానికి 1వ సవరణ చట్టం 1951 తొమ్మిదవ షెడ్యూల్‌ను చేర్చారు.* |
| **పదవ షెడ్యూల్** | పార్లమెంటు మరియు రాష్ట్ర శాసనసభ సభ్యుల పార్టీ ఫిరాయింపు కారణంగా అనర్హతకు సంబంధించిన నిబంధనలు. ఫిరాయింపు. ఈ షెడ్యూల్‌ను 1985లో 52వ సవరణ చట్టం. |
| **పదకొండవ షెడ్యూల్** | పంచాయతీల అధికారాలు, అధికారం మరియు బాధ్యతలను పేర్కొనే నిబంధనలను కలిగి ఉంది. దీనిలో 29 విషయాలు ఉన్నాయి. 1992లో 73వ సవరణ చట్టం. |
| **పన్నెండవ షెడ్యూల్** | మునిసిపాలిటీల అధికారాలు, అధికారం మరియు బాధ్యతలను పేర్కొనే నిబంధనలతో వ్యవహరిస్తుంది. దీనిలో 18 విషయాలు ఉన్నాయి. 1992లో 74వ సవరణ చట్టం. |

– బాలచెలిమి డెస్క్



# పిండి పదార్థాలు ఎక్కువ మాంసకృత్తులు తక్కువ ఉంటున్నాయి

భారతీయుల భోజనంలో షుగర్స్, సంతృప్త కొవ్వులు, అత్యల్ప ప్రోటీన్లు ఉంటున్నాయని తెలుపుతూ, దీని ఫలితంగా పలు అసాంక్రమిక వ్యాధుల (నాన్-కమ్యూనికెబుల్ డిసీజెస్) వలయంలో చిక్కనున్నట్లు నివేదిక వివరిస్తున్నది. మనం నిత్యం తీసుకునే భోజనంలో బియ్యం, గోధుమలు, షుగర్స్, కొవ్వులు, ఉప్పు అధికంగా ఉంటున్నదని, పప్పులు లేదా ప్రోటీన్లు అతి తక్కువగా ఉంటున్నాయని నిపుణులు గుర్తించారు. కార్బోహైడ్రేట్ల పరిమాణం పెరగడంతో మరో 30 శాతం మందికి టైప్-2 మధుమేహాన్ని, 20 శాతం వరకు ప్రీ-డయాబెటిస్ బారిన, 22 శాతం స్థూలకాయ ఊబిలో పడవచ్చని అంచనా వేసారు.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
m : 9949700037

కథ

# కల నిజమాయెగ...



రాత్రి అమ్మ అందరికీ అన్నం కలిపి ముద్దలేసింది. ఎందుకో తెలియదు మనం కలుపుకొని ఎంత రుచికరమైన ఆహారం తిన్నా అమ్మ చేతి పచ్చడి ముద్దంత మధురంగా అయితే ఉండదు. కార్తి కాసేపు స్కూల్లో ఇచ్చిన ఇంటి పని పూర్తి చేసుకుని పడక చేరాడు. రోజు పడుకొనే ముందు నాన్న మంచి కథలు చెబుతుంటే వాటిని విని పడుకోవడం అలవాటు.

నాన్న చెప్పిన కథ ఈ రోజు ఎంతబాగుందో అనుకుంటూ నిద్రపోయాడు కార్తి. పడుకుంటే ఎప్పుడూ మధ్యలో మెలుకువే రాదు అలాంటిది ఉన్నట్టుండి ఏదో చప్పుడైనట్లు అనిపించింది. నిద్రలో మగతగానే కళ్ళు తెరిచి చూశాడు ఎక్కడా ఏమి కనపడలేదు. మళ్ళీ అలా కళ్ళు మూశాడో, లేదో ఎక్కడో నీళ్ళ శబ్దం వినిపించింది రాను రాను అది ఎక్కువ అవుతోంది. ఏమైందో చూద్దామని మళ్ళీ నిద్ర లేచాడు. పై వైపు ఎక్కడా ఏమి కనపడలేదు, మంచం క్రిందకు దిగి చూద్దామని కాళ్ళు క్రింద పెట్టాడు. చల్లగా నీళ్ళ చెమ్మ తగిలింది. అప్పటికే గది మొత్తం వ్యాపించాయి నీళ్ళు. ఇదేంటి ఇన్ని నీళ్ళు... అది కూడా గది మొత్తం, అసలు అమ్మ ఇంట్లో నీళ్ళకు ఇబ్బందని చూసి చూసి చాలా పొదుపుగా వాడుతుంది అలాంటిది ఇన్ని నీళ్ళు, ఇల్లు శుభ్రం చేయడానికి ఏమైనా తెచ్చినప్పుడు కిందపడి ఉంటుందా? లేక చెల్లెలు ఆడుకుంటూ తన అల్లరి వల్ల ఇలా చేసిందా? ఇలా రకరకాల ప్రశ్నలు అతనిలో తనే వేసుకుంటూ ఏం జరిగిందో అన్న ప్రశ్నకు సమాధానం వెతుకుతున్నాడు.

దిగి గదులన్నీ చూశాడు, తన గది మాత్రమే కాదు ఇల్లంతా నీళ్ళు, ఎటు చూసినా నీళ్ళు ఎక్కడా అమ్మ కనపడలేదు. అమ్మ... అమ్మ అంటూ గట్టిగా పిలిచాడు అయినా అమ్మ, నాన్న, చెల్లి రాలేదు భయంతో చూస్తుండగానే నీళ్ళు ఇల్లంతా నిండిపోతున్నాయి. తాను మునిగి పోతానన్న భయంతో గట్టిగా "అమ్మా....." అంటూ అరిచాడు కార్తి. అమ్మ ఏమైందిరా లే... లే... అంటూ లేపేసరికి కళ్ళు తెరిచాడు. చుట్టూ ఎక్కడా నీళ్ళు లేవు. అమ్మా... కల... నీళ్ళు అంటూ చెప్పబోయాడు. కాసేపు ఆగమని నీళ్ళ గ్లాసు చేతికిచ్చింది అమ్మ. తాగాక తన కల అంతా చెప్పాడు అమ్మకు. ఏం కాదు నిద్రపొమ్మన్నది అమ్మ.

* * *

ఉదయం నిద్ర లేచి స్నానానికి వెళ్ళాడు కార్తి. ఎక్కువ సేపు తను స్నానం చేయడం గమనించింది అమ్మ.తను షవర్ తిప్పి చాలాసేపు ఆపలేదు. బయటకు రాగానే బట్టలు ఇచ్చి టిఫిన్ పళ్ళెం అందించింది అమ్మ. "కార్తీ నిన్న రాత్రి కల నీకు ఎందుకు వచ్చిందో తెలుసా?" అంది అమ్మ.

"కల రావడానికి కూడా అర్థం ఉందా అమ్మ" అన్నాడు అమాయకంగా. "ఎందుకు లేదు. నిన్న నీకు వచ్చింది ఒక కల మాత్రమే కాదు. అది ఒక హెచ్చరిక కూడా, నీకు కలలో కూడా మన ఇంట్లో నీటి సమస్య ఉందని తెలుసు, అంత నీరు ఇంట్లో ఉంటే కూడా నువ్వు మనకు నీటి కొరత ఉందని అనుకున్నావు. అలాంటిది ఇప్పుడు నువ్వు స్నానం చేస్తూ ఎంత నీళ్ళు వృధా చేశావో తెలుసా?" అంది కాస్త గట్టిగా.

తాను చేసిన తప్పు తెలుసుకున్నాడు కార్తి. మరుసటి సెలవు రోజు నాన్నతో కలసి తన ఇంట్లోని పెరట్లో ఇంకుడు గుంత తవ్వించాడు. పైన పడే వర్షపు నీటిని అందులోకి మళ్ళించే విధంగా అమర్చారు. "ఇదంతా గమనించిన అమ్మ అరె... కార్తి ఒక్క కల నీలో ఎంత మార్పు తెచ్చిందో చూసావా?" అంది నవ్వుతూ.

మార్పు తెచ్చింది కల కాదు అమ్మా, నీ మాటలు అన్నాడు అమ్మను హత్తుకుంటూ. ఇంతలో నాన్న మట్టి అంటిన చేతిని కడగ బోయాడు. నాన్న కాస్త ఆగు అంటూ ఆయన చేతిని పట్టుకొని పూల మొక్కల దగ్గరకు తీసుకెళ్ళాడు. నాన్నా ఇప్పుడు కడగండి చేయి అన్నాడు కార్తి, అమ్మ వైపు చూస్తూ కొడుకులోని మార్పుకు ముచ్చట పడ్డాడు నాన్న.


– సింగంపల్లి శేష సాయి కుమార్

కేశవయన గుంట, తిరుపతి. m : 8639635907

పక్షి

# రంగుల రెక్కల హిమాలయ పక్షి
# స్లేటర్ మోనాల్



హిమాలయ పర్వత ప్రాంతాలకు చెందిన అరుదైన, అద్భుతమైన పక్షి జాతుల్లో లోఫోఫోరస్ స్క్లాటెరి, సాధారణంగా స్లేటర్ మోనాల్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ పక్షిని 1870వ సంవత్సరంలో ప్రముఖ పక్షిశాస్త్రవేత్త టీ.సి. జెర్డన్ శాస్త్రీయంగా గుర్తించారు. ఇది ఫీజంట్ (Phasianidae) కుటుంబానికి చెందిన పక్షి. భారతదేశ జీవ వైవిధ్యంలో ఎంతో ప్రత్యేకమైన ప్రాధాన్యతను సంతరించుకుంది. స్లేటర్ మోనాల్ ప్రధానంగా భారతదేశ ఈశాన్య హిమాలయ ప్రాంతాల్లో నివసిస్తుంది. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎత్తైన అడవులు, ఆల్పైన్ మైదానాలు, పర్వత శిఖరాల చుట్టూ ఉన్న ప్రాంతాలు దీని సహజ నివాసస్థానాలు. ఈ పక్షి సాధారణంగా సముద్ర మట్టానికి 3,000 నుంచి 4,500 మీటర్ల ఎత్తులో నివసిస్తుంది. చల్లని వాతావరణం, దట్టమైన అడవి పొదలు, రాళ్లతో కూడిన గడ్డి ప్రాంతాలు ఈ పక్షికి అత్యంత అనుకూలంగా ఉంటాయి. స్లేటర్ మోనాల్ ఆకృతి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. మగ పక్షి తలపై ఆకుపచ్చ, నీలం, రాగి రంగుల మెరుపుతో కూడిన ఈకలు మెరిసిపోతుంటాయి. దీని రెక్కలు మరియు తోక భాగం గాఢమైన రంగులతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. దీనికి భిన్నంగా ఆడ పక్షి గోధుమ మరియు మసక రంగుల్లో ఉండి, సహజ వాతావరణంలో కలిసి పోతుంది. ఇది శత్రువుల నుంచి తప్పించుకోవడానికి సహాయపడుతుంది. ఆహార విషయానికి వస్తే, స్లేటర్ మోనాల్ ప్రధానంగా వేర్లు, గింజలు, మొక్కల మొగ్గలు, ఆకులు మరియు కీటకాలను తింటుంది. ఇది ఒంటరిగా లేదా జంటలుగా సంచరిస్తుంది.

చలికాలంలో వాతావరణం తీవ్రంగా మారినప్పుడు, జీవన సౌలభ్యం కోసం తక్కువ ఎత్తు ప్రాంతాలకు వలస వెళ్తుంది. ఇది ప్రకృతితో అనుసంధానమై జీవించే పక్షిగా చెప్పవచ్చు. ప్రజనన కాలంలో ఆడ పక్షి నేలపై గూడు నిర్మించి గుడ్లు పెడుతుంది. పిల్లలను సంరక్షించే బాధ్యత ప్రధానంగా ఆడ పక్షిదే. సహజ శత్రువుల నుంచి పిల్లలను కాపాడుకోవడానికి ఇది ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. ఈ దశలో పక్షి ప్రవర్తన అత్యంత అప్రమత్తంగా ఉంటుంది. దురదృష్టవశాత్తు, స్లేటర్ మోనాల్ ప్రస్తుతం అత్యంత ప్రమాదంలో ఉన్న (Endangered) జాతిగా గుర్తించబడింది. స్లేటర్స్ మోనాల్ అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి (IUCN) రెడ్ లిస్ట్‌లో “హాని కలిగించే” (Vulnerable) జాతిగా జాబితా చేయబడింది. అడవుల నాశనం, అక్రమ వేట, మానవ నివాసాల విస్తరణ, రహదారులు మరియు అభివృద్ధి పనులు దీని సంఖ్య తగ్గిపోవడానికి ప్రధాన కారణాలు. ఈ అరుదైన పక్షిని కాపాడుకోవడానికి రక్షిత అటవీ ప్రాంతాల ఏర్పాటు, స్థానిక ప్రజల్లో అవగాహన పెంపు, పర్యావరణ విద్యా కార్యక్రమాలు ఎంతో అవసరం. స్లేటర్ మోనాల్ భారతీయ హిమాలయాల సహజ సంపదకు ఒక ప్రతీక. దీని సంరక్షణ మన అందరి బాధ్యత. ప్రకృతిని కాపాడినప్పుడే ఇలాంటి అరుదైన పక్షిజాతులు భవిష్యత్ తరాలకు నిలుస్తాయి. జీవ వైవిధ్యాన్ని రక్షించడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే అనే సత్యాన్ని మనం గుర్తించాలి. ఈ పక్షిని భారతదేశంలో వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972 ప్రకారం షెడ్యూల్ జాతిగా చేర్చారు. దీనికి అత్యున్నత స్థాయి రక్షణ కల్పిస్తున్నారు.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

## దామెర, పోత్గల్, రాజుపేట జి.ప.ఉ.పాఠశాలలు

# “బాల చెలిమి గ్రంథాలయం” (పాఠశాల విద్యార్థుల కోసం నూతన విజ్ఞాన కేంద్రం)

పాఠశాలలో “బాల చెలిమి” నూతన గ్రంథాలయం ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉంది. చిన్నతనం నుంచే పుస్తకాలతో స్నేహం పెంచుకుంటే పిల్లల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత, విలువలు వికసిస్తాయి. ముఖ్యంగా బాలికల విద్యకు గ్రంథాలయం దిశానిర్దేశకంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి నా కృతజ్ఞతలు. బాల చెలిమి పుస్తకాలు అందజేసిన బాలచెలిమి కన్వీనర్ శ్రీ గరిపల్లి అశోక్ గారు, కైజర్ గారికి ధన్యవాదాలు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలతో ఈ గ్రంథాలయాన్ని సమృద్ధిగా తీర్చిదిద్దుతూ, విద్యార్థుల్లో పఠన సంస్కృతిని విస్తరించేందుకు బాలచెలిమి నిరంతరం కృషి చేస్తుంది.

– శ్రీ మణికొండ వేదకుమార్
సంపాదకులు, బాల చెలిమి



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దామెర (ఎల్కతుర్తి మండలం, హనుమకొండ జిల్లా)లో చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో “బాల చెలిమి” నూతన గ్రంథాలయం ఘనంగా ప్రారంభించ బడింది. ఈ గ్రంథాలయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గుడిపెల్లి సదానందం గారు ప్రారంభించి, విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించడంలో గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాలకు విలువైన పుస్తకాలను అందజేసిన బాలచెలిమి సంపాదకులు, వ్యవస్థాపకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి, బాలచెలిమి కన్వీనర్ శ్రీ గరిపల్లి అశోక్ గారికి, కైజర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీ అనంతుల శ్రీనివాస్, శ్రీ హరికృష్ణ మహేందర్, శ్రీమతి శారద, శ్రీమతి తబిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ గ్రంథాలయం విద్యార్థినుల విద్యా, సృజనాత్మక అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తమైంది.

జడ్పీహెచ్ఎస్ పోత్గల్ ఆవరణలో స్కూల్ విద్యార్థుల సమక్షంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ గారు, ప్రధానోపాధ్యాయులు శ్రీ సురభి రాధాకిషన్ రావు గారు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ హైదరాబాదు ఆధ్వర్యంలో బాలచెలిమి గ్రంథాలయం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లలు, పెద్దలు పుస్తకాలు చదవకపోవడం, ఫోన్, టీవీల బానిసలవడం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనాశక్తి తగ్గిపోతున్నదని తెలిపారు. ప్రతి పుస్తకం జ్ఞానాన్ని అందిస్తుందని, చిన్నతనంలోనే పుస్తక పఠనం అలవాటు



చేసుకోవాలని సూచించారు. బాలచెలిమి సంపాదకులు శ్రీ వేదకుమార్ గారి ప్రోత్సాహానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పుస్తకాలు మనకు ఊహల రెక్కలను ఇస్తాయని, వాటి ద్వారా మానసిక బలం, సృజనాత్మకత పెరుగుతుందని వివరించారు. బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభం పాఠశాల విద్యార్థులకు జ్ఞానప్రదమైనదిగా నిలిచిందని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోల కృష్ణ, వార్డు మెంబర్లు జంగారాజు, రమేష్, తోట ధర్మేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.




జడ్పిహెచ్ఎస్ రాజుపేట ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుశీల గారు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ హైదరాబాదు వారి బాలచెలిమి గ్రంథాలయంను ఘనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలి. స్మార్ట్‌ఫోన్ మరియు ఇతర డిజిటల్ అలసత్వాల నుంచి దూరంగా ఉండగలుగుతారని, పుస్తకాలు మన జీవితానికి మల్లెపూలలా సుగంధాన్ని, ఊహలకు రెక్కలను అందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలచెలిమి సంపాదకులు శ్రీ వేదకుమార్ గారి దాతృత్వాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అజర్ అలి, శ్రీధర్, సురేష్, బ్రాహ్మణా, పద్మాచారి పాల్గొని విద్యార్థులకు ప్రేరణ కలిగించారు.

– బాలచెలిమి డెస్క్

# బాలచెలిమి సృజన వినూత్న ఆవిష్కరణ



శ్రీ మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో బాల చెలిమి జాతీయ కథల పోటీ-2025లో ఎంపికైన ఉత్తమ కథలను ఎనిమిది కథా సంకలనాలుగా ప్రచురించారు. సిద్దిపేట జిల్లా అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది కథా సంకలన పుస్తకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి అధ్యక్షత వహించగా, కథల పోటీ కన్వీనర్ గరిపెల్లి అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 7వ-9వ తరగతుల విద్యార్థులైన ఎనిమిది మంది పిల్లలు ఎనిమిది కథా సంకలనాలను వేదికపై సమీక్షించి సభకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తెలుగు ఉపాధ్యాయులు కోణం పర్శరాములు కార్యక్రమాన్ని పరిచయం చేయగా, ఉపాధ్యాయులు నరేష్, సమ్మయ్య, రమణ బాల చెలిమి పుస్తకాల విశిష్టతను వివరించారు. అనంతరం సమీక్ష చేసిన విద్యార్థులను గరిపెల్లి అశోక్ సన్మానించారు. గరిపెల్లి అశోక్, బాల చెలిమి కన్వీనర్ మాట్లాడుతూ.. బాల చెలిమి కథల పోటీకి తెలుగు రాష్ట్రాల నుంచి విశేష స్పందన లభించిందని, ఉపాధ్యాయులు పిల్లల చేత రచనలు చేయిస్తూ పుస్తకాలు రూపొందించడం అభినందనీయమని అన్నారు. నాలుగు నెలల్లోనే కథల ఎంపిక, పుస్తకావిష్కరణ జరగడం సంతోషకరమని ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి పేర్కొన్నారు. బాలసాహిత్య వికాసంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

– బైతి దుర్గయ్య, m : 99590 07914

## పిల్లల రచనలకు ప్రోత్సాహం - తెలంగాణ సాహిత్య అకాడమీ ముందడుగు



రవీంద్రభారతి, పైడి జయరాజ్ థియేటర్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహించిన కథ, కవిత, పద్య, నాటికల పోటీలకు వచ్చిన ఉత్తమ రచనలతో రూపొందించిన 'బాలల ప్రపంచం' కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తల్లి జోల పాటల్లోంచే బాలసాహిత్యం ప్రారంభమైందని, వేమన, సుమతి శతకాలు పిల్లల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయని అన్నారు. సాహిత్యం విద్యార్థుల జీవితంలో భాగమైతే, వారి విద్యా, ఉద్యోగాల్లో విజయం సులభమని చెప్పారు. పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ పి. రవీందర్ మాట్లాడుతూ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ, తండా పాఠశాలల్లో గ్రంథాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ, పిల్లల రచనలపై దృష్టి పెట్టడం, వాటిని పిల్లలకు చేరవేయడం కోసం ఉపాధ్యాయుల కృషి అవసరమని తెలిపారు. కార్యదర్శి నామోజు బాలాచారి, అకాడమీ బాలసాహిత్య ప్రోత్సాహం కోసం చేస్తున్న ప్రత్యేక కృషిని వివరించారు. కథ వర్క్‌షాప్ "కథ రచనలో మెలకువలు"లో డా.వి.ఆర్. శర్మ, డా. అమరవాది నీరజ, రచనలో పాటించవలసిన పద్ధతులు, సృజనాత్మకత పెంపు మార్గాలు వివరించారు. విద్యార్థులకు న్యాయనిర్ణేతల సూచనలు విలువైన మార్గదర్శకంగా నిలిచాయి.

## యంగ్ హార్ట్స్ పుస్తకావిష్కరణ

వనపర్తి జిల్లా పానుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తొలి కథల సంపుటి "యంగ్ హార్ట్స్" పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ప్రజాకవి జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించి పిల్లల ప్రపంచం విశాలమైందని, బాలసాహిత్యం సృష్టించడం సవాలేనని అన్నారు. విద్యార్థుల చేత కథలు రాయించి పుస్తకంగా వెలువరించడం ప్రశంసనీయమన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ చారకొండ వెంకటేష్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి సృజనాత్మక ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సంపాదకుడు కిరణ్ కృషిని అతిథులు అభినందించారు.

## సైన్స్ ఫిక్షన్ కథల పోటీ-2026

జాతీయ సైన్స్ దినోత్సవం 2026 సందర్భంగా బాలల విజ్ఞానకథల సైన్స్ ఫిక్షన్ కథల పోటీ నిర్వహణ. పాల్గొనే విద్యార్థుల వయస్సు 13-19 సం.లు. కథల పంపిణీకి చివరి తేదీ ఫిబ్రవరి 15, 2026. రచనలు పంపవలసిన చిరునామాలు: వి.ఆర్. శర్మ: 304, ఎండికోస్ కౌంటి అపార్టుమెంట్, జ జెక్ కాలనీ వీధి:2, సనత్‌నగర్, హైదరాబాద్-500018. Cell No: 91778 87749

## "మై డియర్ ఫ్రెండు" పుస్తకావిష్కరణ



బాలసాహితీ వేత్త సయ్యద్ షఫీ సంపాదకత్వంలో ఖమ్మం నగరంలోని మోమినాన్ స్కూల్ విద్యార్థులు ఆత్మకథలతో రూపొందించిన "మై డియర్ ఫ్రెండు" పుస్తకాన్ని ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత ఆర్. సీతారాం చేతుల మీదుగా ఆవిష్కరించారు. సీతారాం మాట్లాడుతూ, "జీవితంలో మంచి స్నేహం దొరకడం అదృష్టం. విద్యార్థులు తమ వయస్సులోని అనుభవాలను నిర్మోహమాటంగా రాసి స్నేహాన్ని చూపించారు. రచనలు చాలా బాగున్నాయి. శుభాకాంక్షలు. పాఠ్యప్రక్రియ ద్వారా సాహిత్య మార్గంలో విద్యార్థులను నడిపిస్తున్న షఫీ గారికి అభినందనలు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ఎం. జానకి గారు అధ్యక్షత వహించారు. ఎం.ఈ.ఓ. శైలజలక్ష్మి, ఏ.ఎం.ఓ. పెసర ప్రభాకర్ రెడ్డి, సీ.ఎం.ఓ. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని బాల రచయితలను అభినందించారు.

## స్వరసాధనలో తపస్వి..అమరగాన యోగి...

# ఘంటసాల వెంకటేశ్వర రావు

1922వ సంవత్సరం డిసెంబర్ 4. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా చౌటుపల్లి అనే చిన్న గ్రామంలో ఒక బాలుడు జన్మించాడు. ఆ బాలుడే భవిష్యత్తులో తెలుగు సంగీతానికి శాశ్వత గౌరవాన్ని తెచ్చిన ఘంటసాల వెంకటేశ్వర రావు. సాధారణ కుటుంబంలో పుట్టినా, అతని జీవితాన్ని అసాధారణంగా మలిచింది సంగీతమే.

బాల్యం నుంచే అతనికి సంగీతం అంటే అపారమైన ఆసక్తి. తండ్రి వెంకటేశ్వర రావు గారు హరికథ భాగవతులు. ఇంట్లో ఎప్పుడూ పురాణాలు, కీర్తనలు, పద్యాలే వినిపించేవి. వాటి ప్రభావంతో చిన్న ఘంటసాల మనసులో స్వరాలు సహజంగా పుట్టుకొచ్చాయి. పాఠశాల విద్య కొనసాగుతూనే సంగీత సాధనలో నిమగ్న మయ్యేవాడు. అప్పుడే సంగీతం తన జీవిత లక్ష్యమని నిర్ణయించుకున్నాడు. 1939–1944 మధ్యకాలంలో విజయవాడలోని సంగీత కళాశాలలో చేరి కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందాడు. ఈ కాలం అతని జీవితంలో అత్యంత కీలకమైనది. రోజుకు గంటల తరబడి సాధన చేయడం, స్వరశుద్ధి, భావవ్యక్తీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అతని అలవాటు. గురువులు చెప్పిన "స్వరానికి భావం కలిస్తేనే అది హృదయాన్ని తాకుతుంది" అనే మాటను అతను జీవితాంతం పాటించాడు.



1945లో భారత నౌకాదళంలో చేరాడు. అక్కడ కూడా సంగీతాన్ని వదలలేదు. నౌకాదళ కార్యక్రమాల్లో పాటలు పాడుతూ తన ప్రతిభను చాటుకున్నాడు. అయితే విధి అతనిని మరో దిశగా నడిపించింది. సంగీతమే తన అసలు మార్గమని తెలుసుకొని నౌకాదళానికి రాజీనామా చేసి, పూర్తిగా సంగీతానికే అంకితమయ్యాడు. 1946లో తెలుగు సినీ రంగంలో అడుగుపెట్టాడు. మొదట్లో కోరస్ గాయకుడిగా, చిన్న అవకాశాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పేరు, గుర్తింపు లేని రోజులు ఎన్నో వచ్చాయి. అయినా నిరాశ చెందలేదు. "నా స్వరం ఒక రోజు తన స్థానం తానే సంపాదిస్తుంది" అనే నమ్మకంతో సాధన కొనసాగించాడు.

ఆ నమ్మకం నిజమైంది. 1950ల ప్రారంభంలో అతని స్వరం ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకోవడం ప్రారంభించింది. ముఖ్యంగా పౌరాణిక చిత్రాల్లో ఘంటసాల గానం ఒక ప్రమాణంగా మారింది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శివుడు, కర్ణుడు వంటి పాత్రలకు అతని గొంతు అద్భుతంగా సరిపోయింది. 1957లో విడుదలైన 'మాయాబజార్" చిత్రంలోని కర్ణుడి పాత్రకు ఘంటసాల ఇచ్చిన స్వరం తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. కర్ణుడి గంభీరత, దాతృత్వం, వేదన అన్నీ ఘంటసాల గొంతులో జీవించాయి. 1950–1970 మధ్యకాలం ఘంటసాల స్వర్ణయుగం. ఈ రెండు దశాబ్దాల్లో ఆయన వేలాది పాటలు పాడాడు. భక్తి గీతాలు, పౌరాణిక పాటలు, భావగీతాలు అన్నిటిలోనూ అతని ప్రత్యేక ముద్ర కనిపిస్తుంది. "శివ శంకర శరణం", "జగదేక వీరుడు ఆత్రేయుడు", "శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం" వంటి కృతులు తెలుగు ప్రజల ఆధ్యాత్మిక జీవితంలో భాగమయ్యాయి. దేవాలయాల్లో, పండుగల్లో, శుభకార్యాల్లో అతని స్వరం తప్పనిసరిగా వినిపించేది. అతని గొప్పదనం కేవలం గానంలోనే కాదు, వ్యక్తిత్వంలో కూడా ఉంది. ఎంతటి ఖ్యాతి వచ్చినా అహంకారం అతనిని తాకలేదు. కొత్తగా వచ్చిన గాయకులను ప్రోత్సహించాడు, తన అనుభవాన్ని వారికి పంచాడు. సంగీతాన్ని వ్యాపారంగా కాకుండా సేవగా భావించాడు. అందుకే అతని గానం శుద్ధంగా, పవిత్రంగా వినిపిస్తుంది. 1974వ సంవత్సరం అక్టోబర్ 11న ఘంటసాల వెంకటేశ్వర రావు భౌతికంగా మన మధ్య లేకపోయినా, అతని స్వరం మాత్రం కాలాన్ని జయించింది. రేడియోల్లో, టేప్ రికార్డర్లలో, నేటి డిజిటల్ యుగంలో కూడా అతని పాటలు అదే గంభీరతతో వినిపిస్తున్నాయి. తరతరాల తెలుగు ప్రజలు అతని గానంతోనే రాముడిని, కృష్ణుడిని, శివుడిని దర్శిస్తున్నారు. ఒక వ్యక్తి కాదు... తెలుగు సంగీతానికి ఒక అమర గాన యుగం.

– సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service

CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- **SCHOOL BOOKS**
- **GENERAL BOOKS**
- **STATIONARY & GIFTS**




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026




బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

**తెలంగాణ బడి పిల్లల కథలు** — 10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



**పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)** — 10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు** — 18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com